
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నీళ్లు పారని కాలువలకు
సాగునీటి ఎన్నికలు..!

తొమ్మిదేళ్ల తర్వాత సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ)కు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తోంది. కర్నూలు జిల్లాలో 123 డబ్ల్యూయూఏలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. సాయంత్రం నూతన పాలకవర్గం కొలువుదీరనుంది. జిల్లా జలనవరులు, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పదవుల కోసం ఆరాటపడుతున్న టీడీపీ కూటమి నాయకులు ఓట్ల కోసం రైతుల ఇళ్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమకే మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పుడు ఏ ఎన్నికలు ఉన్నాయి..? అంటూ రైతులు ప్రశ్నిస్తే.. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు అంటూ నాయకుల సమాధానం. పాతికేళ్లుగా సాగునీరే కాలువల్లో పారలేదు.. నీళ్లే లేని కాలువలకు నీటి ఎన్నికలా..? అంటూ రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. యువరైతులైతే ఈ కాలువల్లో నీరు పారడం చూడలేదని అంటున్నారు. పలు గ్రామాల్లో రూ.వందల కోట్ల విలువైన ఎల్లెల్సీ కాలువ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. ఈ పరిస్థితుల్లో సాగునీటి ఎన్నికలు జరగబోతున్నాయి.

- పాతికేళ్లకు పైగా సాగునీరు అందని ఆయకట్టు
- రూ.200 కోట్లకు పైగా విలువైన భూములు అన్యాక్రాంతం
- నేడు జిల్లాలో 123 డబ్ల్యూయూఏలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఎన్నికల నిర్వహణకు కర్నూలు జిల్లాకు రూ.20 లక్షలు మంజూరు



సాగునీటి సంఘాల ఎన్నికల కేంద్రాలకు పంపేందుకు సామగ్రి సిద్ధం చేస్తున్న ఏఈఈ రంగన్న, సిబ్బంది

కర్నూలు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ కాలువలు సహా పంట కాలువలు 1955లో నిర్మాణం చేశారు. తుంగభద్ర జలాశయం నుంచి ఎల్లెల్సీ నీటి వాటా 24 టీఎంసీలు. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు, రబీలో 1,07,615 ఎకరాలు కలిపి 1,51,134 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఆదోని మండలం హనవాళ్ల వద్ద టీబీపీ బోర్డు సరిహద్దు 250 కిలోమీటర్ల నుంచి కోడుమూరు సమీపంలో 324 కిలోమీటర్ల వరకు 74 కిలోమీటర్లు టీబీపీ ఎల్లెల్సీ, అక్కడి నుంచి 0/0 నుంచి 49 కిలోమీటర్లు వరకు అంటే.. కల్లూరు సమీపంలో వక్కెర వాగు వరకు 49 కి.మీలు టీబీపీ ఎల్లెల్సీ కర్నూలు బ్రాంచి కాలువ (కేబీసీ) ఉంది. ఈ కాలువ పరిధిలో సుమారుగా 51,900 ఎకరాలకు ఆయకట్టు ఉంది. పాతికేళ్ల క్రితం వెనక్కి వెళ్తే తుంగభద్ర జలాలు వచ్చేవని పెద్దపాడు గ్రామానికి చెందిన 75 ఏళ్ల ఓ రైతు పేర్కొన్నారు. కర్ణాటక జల చౌర్యం, ఎగువన అక్రమ ఆయకట్టు సాగు పెరగడం, రాజకీయ జోక్యం, ఇంజనీర్ల నిర్లక్ష్యం వెరసి కర్నూలు రూరల్, గూడూరు మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందని ద్రాక్షగా మారాయి. రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే ఆయకట్టు. వానొస్తే తప్ప పంటలు పండని దైన్యస్థితికి చేరింది. చివరి ఆయకట్టు గ్రామాలు రైతులు ఏనాడో సాగునీటిని మరిచిపోయారు.

● ఆ కాలువలకు పాలకవర్గాలా..?

రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఎల్లెల్సీ కాలువ పరిధిలో 58 డబ్ల్యూయూఏలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంది. డబ్ల్యూయూఏ టీసీ సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులను శనివారం రైతులు ఎన్నుకోవాలి. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆయకట్టు రైతులను గుర్తించి ఓటర్ల జాబితా తయారు చేశారు. గూడూరు మండలం కె.నాగులాపురం, కర్నూలు రూరల్ మండలం ఉల్చాల, మునగలపాడు, కల్లూరు మండలం పర్ల, పెద్దపాడు సాగునీటి వినియోగదారులు (డబ్ల్యూయూఏ) పరిధిలో 60 మంది టీసీ సభ్యులు, ఆ ఐదు డబ్ల్యూయూఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోబోతున్నారు. డబ్ల్యూయూఏ అధ్యక్షులు కర్నూలు -10 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాలి. ఆయా గ్రామాల ఆయకట్టుకు పాతికేళ్లకు పైగా సాగునీరు అందడం లేదు. 1980 నుంచి కాలువల్లో నీరు పాడం లేదని ఓ ఆయకట్టు రైతు వాపోయారు. రేమట, సింగవరం గ్రామాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. అయితే అడపాదడపా గురురాఘవేంద్ర లిఫ్ట్ ద్వారా నీటిని ఇస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తుండడంతో పదవులపై ఆసక్తి ఉన్న నాయకులు ఓటర్ల జాబితా పట్టుకొని ఇంటింటికి వెళ్లి శనివారం జరిగే నీటి సంఘాల ఎన్నికలకు రావాలని, తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. దశాబ్దాలు కాలంగా నీళ్ల పారని కాలువలకు ఎన్నికలా..? కొత్తగా ఎన్నికయ్యే పాలకవర్గాలు నీళ్ల తెప్పిస్తారా..? అది సాధ్యమయ్యే పనేనా..? అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.



ఆదోని తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ కార్యాలయం

● కాలువ భూములు అన్యాక్రాంతం

కర్నూలు నగరంలో స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారం జోరందుకోవడంతో నగర శివారులో ఉన్న కల్లూరు, పెద్దపాడు, ఉల్చాలా, మునగలపాడు గ్రామాల్లో వెంచర్లు వెలిశాయి. ఆయకట్టు కనుమరుగై రియల్ వెంచర్లు వెలిశాయి. టీబీపీ ఎల్లెల్సీ కర్నూలు బ్రాంచి కాలువ భూములు కూడా ఆక్రమణకు గురయ్యాయని టీబీపీ ఎల్లెల్సీ ఇంజనీరింగ్ అధికారి ఒకరు వాపోయారు. ఉల్చాల, పెద్దపాడు, కల్లూరు, మునగలపాడు, కర్నూలు ప్రాంతాల్లో దాదాపు వంద ఎకరాలకు పైగా కాలువ భూమి అన్యాక్రాంతమైంది. ప్రస్తుత బహిరంగ మార్కెట్ ప్రకారం ఆ భూముల విలువ దాదాపుగా రూ.200 కోట్లకు పైగా ఉంటుందని అధికారులే అంటున్నారు. పదేళ్ల క్రితం ఓ అధికారి కె.నాగులాపురం నుంచి కల్లూరు సమీపంలోని వక్కెరువాగు వరకు టీబీపీ ఎల్లెల్సీ కేబీసీ కాలువ భూములపై సర్వేకు శ్రీకారం చుడితే.. రాజకీయ నేతలు రంగంలోకి దిగి సర్వే జరగకుండా తొక్కిపెట్టారు.

మిగతా 6లో...

రెవెన్యూ సదస్సుల్లో
449 అర్జీలు

● డీఆర్వో వెంకట నారాయణమ్మ



గోనెగండ్లలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 28 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి 449 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామంలో 6, నందవరంలో 38, బనవాసిలో 21, డి.బెళగల్‌లో 24, రామాపురంలో 1, రంగాపురంలో 3, చిన్నహరివానంలో 12, సంతేకుడ్లూరులో 27, కౌతాళం మండలం నడిచాగిలో 7, మేలిగనూరులో 7, హొళగుంద లింగదహల్లిలో 10, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లిలో 67, దూపాడులో 19, కలుగోట్లలో 13, పులకుర్తిలో 23, పసుపుల గ్రామంలో 10, జులేకల్లులో 3, గుండ్రేవులలో 16, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని తుగ్గలి మండలం పెండేకల్‌లో 10, లక్కసాగరంలో 60, మద్దికెర నార్త్ గ్రామంలో 15, అరికేరలో 24, బంతనహాల్‌లో 11, బిలేకల్‌లో 10, టి.సాకిబండలో 3, బేవనహాల్ 1, శ్రీధరహాల్‌లో 1, కుంకనూరులో 7 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో ప్రభుత్వ భూములపై ఆక్రమణ, రక్షణ 2, ఇంటి పట్టాల కోసం 2, ప్రభుత్వ భూమిపై 34, వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే వన్‌టైమ్ సెటిల్మెంట్ ఫిర్యాదులు 1, నిషిద్ధ భూముల జాబితా నుంచి తమ భూములు తొలగించాలనే ఫిర్యాదులు 42, రీసర్వే గ్రీవెన్స్‌లు 46, ఇనామ్స్ గ్రీవెన్స్‌లో4, భూసేకరణ ఫిర్యాదులు 2, ఆర్‌వోఆర్‌కేసులకు సంబంధించి 286, మార్గ వివాదాలు 1, ఇతరాలు 29, మొత్తం కలిపి 449 అర్జీలు వచ్చాయనీ తెలిపారు.

దగా పడ్డ మిర్చి రైతు

- మార్కెట్ యార్డులో ముంచుతున్న వ్యాపారులు
- 40 మందికి లైసెన్సులు.. 10 మందే కొనుగోళ్లు
- భారీ మొత్తంలో జీరో వ్యాపారం
- ప్రకృతి వైపరీత్యాలకు మించిన నష్టం
- దారి తప్పిన అధికారుల నిఘా
- 4 నుంచి 6 శాతం కమీషన్ ముక్కుపిండి వసూలు



ఈ రైతు పేరు గోపాల్. కర్నూలు మండలం రేమట గ్రామం. ఈ రైతు బుధవారం కర్నూలు మార్కెట్ యార్డుకు 6 బస్తాల ఎండుమిర్చిని అమ్మకానికి తీసుకువచ్చాడు. తూకాలు వేసే సమయంలో అధికారులు పత్తా లేకుండా పోయారనీ, తూకం కూడా తక్కువ చూపి కొంత మిర్చిని కొట్టేశారనీ, కమిషన్ 4 నుంచి 6 శాతం వ్యాపారి డిమాండ్ చేశారనీ గోపాల్ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇది ఈ రైతు అనుభవమే కాదు. ఎండుమిర్చిని అమ్మకానికి తెచ్చిన ఉమ్మడి జిల్లా రైతులు, తెలంగాణ రాష్ట్రంలోని అలంపూరు తదితర ప్రాంతాల రైతులు కూడా దగా పడుతున్నారు. గుంటూరు మిర్చి యార్డు తర్వాత కర్నూలు మిర్చి యార్డుకు వేలాది మంది రైతులు ఎండుమిర్చిని అమ్మకానికి తీసుకువస్తారు. అధికారుల నిర్లక్ష్యం వహించడం, వ్యాపారులతో కుమ్మక్కు కావడం వల్లనే తమకు గిట్టుబాటు ధర అందడం లేదని, ఇష్టారాజ్యంగా వ్యాపారులు తమను దోచేస్తున్నారనీ మిర్చి రైతులంతా ఆందోళన చెందుతున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో దాదాపు 50వేల ఎకరాల్లో ఎండుమిర్చిని రైతులు సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి రైతులు ప్రకృతి వైపరీత్యాలతో పాటు వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలు, తుపాన్ కారణంగా మిర్చి రైతులకు భారీ నష్టం జరిగి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పరిస్థితులు అనుకూలించి వుంటే ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. అయితే.. నల్లి, తామర తదితర తెగుళ్ల వల్ల, కీటకాల వల్ల మిర్చి పంటకు భారీగా నష్టం జరిగింది. ఎకరాకు కేవలం 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే అందింది. కనీసం చేతికందిన కాస్తో.. కూస్తో దిగుబడినైనా గిట్టుబాటు ధరకు అమ్ముకుందామనే ఆశతో రైతులు గుంటూరు మార్కెట్ యార్డుకు వెళ్లకుండా రవాణా ఖర్చులు కలిసి వస్తాయనే ఆశతో కర్నూలు మిర్చి యార్డుకు అమ్మకానికి తెస్తున్నారు. అయితే.. వ్యాపారులు వారిని దగా చేస్తున్నారు. వారితో చేతులు కలుపుతున్న అధికారుల కారణంగా రైతులు నిండా మునిగిపోతున్నారు. ఒక ఎకరా మిర్చి సాగుకు దాదాపు రూ.1లక్ష పైగానే ఖర్చు పెడుతున్నామనీ, అయితే.. యార్డులో భారీగా నష్టాల పాలవుతున్నట్లు రైతులు తెలిపారు. ప్రకృతి విపత్తు కంటే యార్డులోనే ఎక్కువ నష్టపోతున్నామని అంటున్నారు.

40 మందికి గాను పది మంది మాత్రమే కొనుగోళ్లు

కర్నూలు మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లు జరపడానికి 40 మంది లైసెన్సులు తీసుకున్నారు. అయితే.. అందరూ కొనుగోళ్ల కోసం పోటీ పడితే.. రైతులకు ధర ఎక్కువగా చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో వ్యాపారులు కూడగట్టుకుని కేవలం పది మంది మాత్రమే మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. ఆ పది మంది కొనుగోలు చేసిన మిర్చినే టెండరులో పాల్గొనని వ్యాపారులు కూడా సిండికేట్ అయ్యి వివిధ ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నట్లు సమాచారం. లైసెన్సులు తీసుకున్న 40 మంది చేత టెండరు వేసేందుకు అధికారులు ఏ మాత్రం శ్రద్ధ తీసుకోకపోవడం దారుణమని పలువురు అంటున్నారు. ఈ వ్యవహారంపై ఎన్నోసార్లు మార్కెట్ కమిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం లేవని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా లైసెన్సు తీసుకున్న వ్యాపారుల అందరి చేత కొనుగోళ్లు చేయించాలని, లేకపోతే తాము నష్టపోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెద్ద ఎత్తున జీరో వ్యాపారం:

కర్నూలు మార్కెట్ యార్డులో ఎండుమిర్చి వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుంది. గుంటూరు తర్వాత ఎండుమిర్చి అమ్మకాలు కర్నూలులోనే జరుగుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్క కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులోనే మిర్చి కొనుగోలు జరుగుతుండటంపై తమకు గిట్టుబాటు ధర అందుతుందని రైతులు ఆశించారు. అయితే.. వ్యాపారులు అధికారుల నిర్లక్ష్యాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని గ్రామాలకే వెళ్లి పెద్ద ఎత్తున రైతులతో కొనుగోలు చేసి హైదరాబాద్, మద్రాసు, బళ్లారి తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో జీరో వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతోంది. మార్కెటింగ్ శాఖకు సెస్సు రూపంలో రావాల్సిన దాదాపు రూ.కోటి ఆదాయానికి గండిపడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఏటా 60వేల హెక్టార్లలో మిర్చిని సాగు చేస్తున్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి క్వింటం ఎండుమిర్చికి దాదాపు రూ.20 నుంచి రూ.30 వేల దాకా రైతుకు ఆదాయం లభించింది. దీని వల్ల మార్కెటింగ్ శాఖకు పెద్ద ఎత్తున సెస్సు రూపంలో ఆదాయం వచ్చింది. దీని వల్ల పెద్ద ఎత్తున జీరో వ్యాపారం జరుగుతుండటంతో సెస్సు వసూళ్లకు గండి పడే అవకాశం కనిపిస్తోంది.

మిగతా 7లో...



కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చిన మిరప పంట

అకాల వర్షం..

● రూ.25.24 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం నివేదిక



నేలవాలిన వరి పంట

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలోని పెద్దకడుబూరు, కౌతాళం మండలాల్లో అకాల వర్షం వల్ల పంటలు దెబ్బతిని 35,041 మంది రైతులు నష్టపోయారని, వారికి రూ.25.24 కోట్ల పరిహారం అందించాలని ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ యంత్రాంగం నివేదికను పంపింది. వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల ఈ రెండు మండలాల్లోని ఆ గ్రామాలకు వెళ్లి ఎంత మేరకు రైతులు పంట నష్టపోయింది సర్వే చేశారు. 35,041 మంది రైతులు 14,999 హెక్టార్లలో పంటలు కోల్పోయింది నివేదికలో అధికారులు పేర్కొన్నారు. కౌతాళం మండలంలో 21,169 మంది రైతులు 9,728.854 హెక్టార్లలో 33 శాతం కంటే ఎక్కువ స్థాయిలో పంటలను నష్టపోయారని, వీరికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.16.45 కోట్లు ఇవ్వాలని నివేదికలో ఉన్నట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు. పెద్దకడుబూరు మండలంలో 13,872 మంది రైతులు 5,271.092 హెక్టార్లలో పంటలు నష్టపోయారని, వీరికి రూ.8.78 కోట్ల పరిహారాన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు జేడీ తెలిపారు. సజ్జ 62 హెక్టార్లు, ఆముదం 186 హెక్టార్లు, పత్తి 13,749 హెక్టార్లు, వేరుశనగ 745హెక్టార్లు, కంది 55 హెక్టార్లలో నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన తమకు పరిహారాన్ని వెంటనే అందించాలని రైతులు ప్రభుత్వాన్ని మొర పెట్టుకుంటున్నారు.

రైతుల సహకారం ముఖ్యం

- గ్రేడింగ్ టమోటాకు గిట్టుబాటు ధర
- మార్కెట్‌శాఖ ఏడీఎం నారాయణమూర్తి



టమోటా విక్రయాలను పరిశీలిస్తున్న అధికారులు

పత్తికొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు సహకారం అందించి గ్రేడింగ్ చేసిన టమోటాను మార్కెట్‌కు తీసుకొస్తే గిట్టుబాటు ధర కల్పించగలమని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి వెల్లడించారు. శుక్రవారం పత్తికొండ మార్కెట్‌యార్డ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన టమోటా పంటకు మంచి ధరలు లభించాయన్నారు. కాగా గడచిన ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తమిళనాడు, తెలంగాణా ప్రాంతాల్లో అధిక వర్షాలు కురవడంతో అక్కడ రైతులు సాగుచేసిన టమోటా పంట దెబ్బతిందన్నారు. దీంతో డిమాండ్ పెరగడంతో పత్తికొండ మార్కెట్ యార్డ్‌కు వచ్చిన గ్రేడింగ్ టమోటాతోపాటు నాసిరకం టమోటాను వ్యాపారులు మంచి ధరకు కొనుగోలుచేసి ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో స్థానికంగా దిగుబడులు రావడంతో పత్తికొండ మార్కెట్ నుంచి వెళ్లే పంటకు డిమాండ్ తగ్గిందన్నారు. అయితే పత్తికొండ మార్కెట్‌లో వ్యాపారులు గ్రేడింగ్ టమోటాను గిట్టుబాటు ధరకు కొంటున్నారని, నాసిరకం పంటను మాత్రమే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. దీనికితోడు ప్రభుత్వం తరఫున మార్కెట్‌శాఖ గిట్టుబాటు ధరలకు పంటను కొనుగోలుచేసి విజయవాడ, కర్నూలు వంటి ప్రాంతాల్లో రైతుబజార్లకు పంటను రోజుకు 10నుంచి20 టన్నులమేర తరలిస్తున్నామన్నారు. ప్రభుత్వం తరఫున కొనుగోలు చేసి రైతుబజార్లకు తరలించాలన్నా గ్రేడింగ్‌తో నాణ్యత కలిగిన టమోటా కావాల్సి ఉంటుందన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలంటే రైతులు తమకు పూర్తి సహకారం అందించాలని కోరారు.



మాట్లాడుతున్న మార్కెట్‌శాఖ ఏడీఎం నారాయణమూర్తి

ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'టమోటా కిలో రూ.1' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్ శాఖ, రెవెన్యూ అధికారులు స్పందించారు. శుక్రవారం ఆర్డీవో భరత్‌నాయక్, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి రామాంజినేయులు పత్తికొండ మార్కెట్‌యార్డ్‌లో టమోటా కొనుగోళ్లను పరిశీలించారు. ఆర్డీవో భరత్‌నాయక్ రైతులు, వ్యాపారులతో మాట్లాడి పరిస్థితి సమీక్షించారు. కాగా శుక్రవారం టమోటా ధర కిలో రూ8 నుంచి రూ.18 వరకు పలికినట్లు కార్యదర్శి కార్నలీస్ తెలిపారు.

ప్రియురాలు పట్టించుకోవడం లేదని... డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య 7

ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి 7

అప్పుల బాధతో రైతు బలవన్మరణం 7




హర్డల్స్ రేస్‌లో చిరుత వేగం ప్రదర్శిస్తున్న నవాజ్

పరుగుల నవ యువకుడు

● 50కుపైగా రాష్ట్ర స్థాయిలో పతకాలు
● ఫిలిప్పైన్స్, స్వీడన్‌లలో ప్రతిభను చాటుకొన్న ధీరుడు
● చదివింది డిగ్రీ, వృత్తిరీత్యా ఫ్యాబ్రికేటర్



ఆదోని టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : ఆయనకు అరవైఏళ్లు. కానీ పరుగుల రారాజు. ఇరవై ఏళ్ల యువకుడిలా పరుగుల్లో పోటీపడి పతకాలు సాధిస్తారు. వదిలిన బాణంలా ఊహించని రీతిలో పరుగులు తీసి అబ్బురపరుస్తారు. ఆయనే పట్టణానికి చెంది ఖాజా బందే నవాజ్. రన్నింగ్ (హర్డల్స్)లో మన దేశంలోనే కాకుండా విదేశాలలో సైతం తన ప్రతిభను చాటుకున్నారు.

ఖాజా బందే నవాజ్ 20 సంవత్సరాలుగా క్రీడా జగత్తులో తన ప్రతిభను చాటుకుంటున్నారు. శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తరపున ఫుట్ బాల్‌తో పాటు రన్నింగ్ రేస్ పోటీలలో పాల్గొని అనేక జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలలో 50కుపైగా పతకాలు, మెమెంటోలు, ప్రశంసా పత్రాలు కైవసం చేసుకొన్నారు. 2022లో చెన్నైలో జరిగిన నేషనల్స్‌లో వంద మీటర్‌ల రన్నింగ్ రేస్‌లో బ్రాస్ మెడల్, 2023లో కలకత్తాలో జరిగిన నేషనల్స్‌లో వంద మీటర్ల రన్నింగ్ (హర్డల్స్)లో సిల్వర్ మెడల్, 400మీటర్ల రన్నింగ్ (హర్డల్స్)లో బ్రాస్ మెడల్ లభించింది. 2024లో పూణేలో జరిగిన నేషనల్స్‌లో 100మీటర్ల రన్నింగ్ రేస్ (హర్డల్స్)లో గోల్డ్ మెడల్, 300మీటర్ల రన్నింగ్ రేస్ (హర్డల్స్)లో బ్రాస్ మెడల్, 100మీటర్ల రన్నింగ్ రేస్‌లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకొన్నారు. ఇంటర్నేషనల్స్‌లో సైతం చాటుకొన్న ప్రతిభ ఈ వృద్ధ క్రీడాకారుడు విదేశాలలో సైతం తన మెరుపు వేగాన్ని ప్రదర్శించి పలువురి ప్రశంసలు పొందారు. 2023లో ఫిలిప్పైన్స్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీలలో 100మీటర్ల హర్డల్స్ రన్నింగ్ రేస్‌లో నాలుగవ స్థానం, 400మీటర్ల హర్డల్స్ రన్నింగ్ రేస్‌లో ఐదో స్థానం లభించింది. 2024లో స్వీడన్‌లో జరిగిన వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని అంటారు. ఖాజా బందే నవాజ్‌కు 100,400మీటర్ల హర్డల్స్ రన్నింగ్ రేస్‌లలో కూడా పాల్గొని తన సత్తాను ప్రదర్శించే అవకాశం లభించింది. ఇది తనకు మరిచిపోని అనుభవం అంటారు.

● చదివింది డిగ్రీ, వృత్తి రీత్యా ఫ్యాబ్రికేటర్

ఖాజా బందే నవాజ్ డిగ్రీ దాకా చదుకొని ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా ఫ్యాబ్రికేటర్ వృత్తిని ఎంచుకొని అందులో స్థిరపడ్డారు. చదువుకొనే రోజుల నుండి క్రీడలపై ఎక్కువ మక్కువ ఉండేదని, ఇంటర్నేషనల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాలన్నదే తన ఆశయమని నవాజ్ అంటున్నారు.



స్త్రీ పురుషులు సమానం

● క్లస్టర్ వర్శిటీ ఉపకులపతి సాయిగోపాల్


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో స్త్రీ, పురుషులు సమాన పాత్ర పోషిస్తారని, బండికి రెండు చక్రాలాంటి వారని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలో మహిళా సాధికారిత శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు లైంగిక వేధింపులను నియంత్రించే చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే దాడులు చూస్తోంటే సమాజం అభివృద్ధి చెందిందా? అనే సందేహం కలుగుతోందని అన్నారు. ప్రముఖ న్యాయవాది తేజవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని, అప్పుడే అన్యాయాలను ఎదిరిస్తామని అన్నారు. ఈ సదస్సులో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డి ప్రసాదరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ స్పెషల్ సప్లమెంటరీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్శిటీ పరిధిలో డిగ్రీ స్పెషల్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. 1వ సంవత్సరం 120కి 63, రెండో సంవత్సరం 264కు 122, 3వ సంవత్సరానికి 519 మంది పరీక్షలు రాయగా 249 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షల రీవాల్యుయేషన్ కోసం ఈనెల 27 లోపు ఆయా కళాశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద తగిన రుసుం చెల్లించి రిజిస్టర్ చేసుకోవాలని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు.

టమోటా కొనుగోలుకు చర్యలు

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ టమోటా మార్కెట్‌లో రైతుల నుంచి టమోటా కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డుకు 42 టన్నులు వచ్చాయనీ, ఇందులో 13 టన్నులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేసి మచిలీపట్నం, గుంటూరు, కర్నూలులోని అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట, సీ.క్యాంపు రైతుబజార్లకు తరలించినట్లు తెలిపారు. ఇంత వరకు 34 టన్నుల టమోటాను రాష్ట్రంలో వివిధ రైతుబజార్లకు పంపిణీ చేశామన్నారు. పత్తికొండ టమోటా మార్కెట్‌లో టమోటా కిలో రూ.కనిష్ఠ ధర రూ.4కు కొనుగోలు చేయాలని వ్యాపారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ట్రావెల్ బస్సుకు భారీ జరిమానా


డోన్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్

డోన్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీవో అధికారులు వాహనాల తనిఖీలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆరెంజ్ ట్రావెల్స్‌కు సంబంధించి ఏఆర్01జీ4158 బస్సులో 35 మంది ప్రయాణికులతో ఖమ్మం నుంచి బెంగుళూరు వెళ్తుండగా.. ఆర్టీవో క్రాంతి కుమార్ తనిఖీ చేశారు. ఎటువంటి రోడ్డు ట్యాక్స్ కట్టకపోవడంతో రూ. 4.43 లక్షలు జరిమానా విధించి ట్రావెల్ బస్సును డోన్ ఆర్టీసీ డిపోకు తరలించినట్లు ఆర్టీవో తెలిపారు. అలాగే పర్మిట్ లేని ఓవర్‌లోడు వాహనాలకు రూ.82వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

సాగునీటి ఎన్నికలు..!

(5వ పేజీ తరువాయి)



హోళగుందలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే జడ్పీ ఉన్నత పాఠశాల

నీళ్లు పారని కాలువలకు సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు పాలకవర్గం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యే నాయకులు కాలువ భూమి ఆక్రమణలపై దృష్టి సారించాలని, రూ.వందల కోట్ల విలువపై ప్రభుత్వ కాలువ భూములను కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించాలని, పక్కా భవనాలు నిర్మించి ఉంటే. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ధర నిర్ణయించి ఖజానాకు రాబడి పెంచాలని పలువురు కోరుతున్నారు.

● ఎన్నికల నిర్వహణకు రూ.20 లక్షలు

కర్నూలు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో టీబీపీ ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువలతో పాటు మైనర్ ఇరిగేషన్ చెరువుల నిర్వహణ కోసం 123 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు శనివారం ఉదయం 8 గంటలకు ప్రక్రియ మొదలవుతుంది. మేజర్, మీడియం ప్రాజెక్టుల పరిధిలోని ఒక్కో డబ్ల్యూయూఏలో 12 మంది, మైనర్ ప్రాజెక్టు పరిధిలోని సంఘంలో ఆరుగురు టీసీ సభ్యులు ఉంటారు. జిల్లాలో 123 డబ్ల్యూయూఏల పరిధిలో 1,212 మంది టీసీ సభ్యులను నేడు ఎన్నుకుంటారు. మెజార్టీ రైతుల ఆమోదంలో ఎంపికైన టీసీ సభ్యులు సాయంత్రం 3 గంటల తరువాత సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆధ్వర్యంలో జలవనరులు, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. డబ్ల్యూయూఏ ఎన్నికల ఆథరైజ్డ్ అధికారికి ఫారం-1 నుంచి ఫారం-10 వరకు అవసరమైన సామగ్రి అందజేశారు. ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఒక్కో సాగునీటి సంఘం ఎన్నికకు దాదాపు రూ.15-16 వేలు ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే స్టేషనరీ, ప్రింటింగ్, ఓటర్ల జాబితా ప్రింటింగ్, ఇతర మెటీరియల్ కోసం దాదాపుగా రూ.18 లక్షలకు పైగా అధికారులు ఖర్చు చేశారు. అయితే.. ఆయా గ్రామాల్లో తెల్లారగానే నీటి సంఘాల ఎన్నికలు జరగునుండడంతో రాజకీయ వేడి రాజుకుంది. కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు రంగప్రవేశం చేసి ఏకగ్రీవం చేసుకోవడానికి ప్రయత్నాలు తీవ్రం చేశారు. అదే క్రమంలో పోటీ చేయడానికి వైసీపీ నాయకులు కూడా వ్యూహాలకు పదును పెట్టారు.

టీసీ సభ్యుడిగా పోటీకి అర్హతలు ఇవి..

- ఆయకట్టుదారుడై ఓటర్ల జాబితాలో పేరు ఉండాలి
- 2022 నాటికి నీటి తీరువా పన్ను పూర్తిగా చెల్లించినట్లు తహసీల్దారు జారీ చేసిన నోడ్యూ సర్టిఫికెట్ ఉండాలి.
- పట్టాదారు పాసుపుస్తం ఉండాలి
- పోటీ చేయడానికి ఓటు హక్కు కలిగిన ఓ రైతు బలపరచాలి
- ఒక రైతుకు ఎన్ని డబ్ల్యూయూఏల పరిధిలో ఆయకట్టు భూములు, ఓటు హక్కు కలిగి ఉన్నాప్పటికీ ఒక టీసీ సభ్యుడిగానే పోటీకి అర్హుడు. అలాగే ఒకేచోట మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

డిసెంబరులో తుఫానుల గండం

● దెబ్బతినిపోయిన వివిధ పంటలు ● ఆందోళనలో రైతులు

ప్రతి ఏడాది డిసెంబరు నెల వచ్చిందంటే రైతులు ఆందోళనకు గురవుతారు. గత మూడేళ్లుగా ప్రతి ఏడాది ఈ నెలలో తుఫాన్ బారిన పడి పంట నష్టపోయారు. ఈ ఏడాది ఫెంగల్ తుఫాన్ కారణంగా ఈ డిసెంబరు నెలలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండురోజులపాటు రాయలసీమలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- గోనెగండ

ఫెంగల్ తుఫాన్ వల్ల పత్తి పంట నాశనం అయింది. పత్తి కాయ నుంచి మొలకలు వచ్చాయి. దీనికి తోడు పత్తి రంగుమారిపోయింది. ఎమ్మిగ నూరు, మంత్రాలయం నియోజకవర్గాలలో పత్తి పంట దాదాపు 10వేల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 5 కోట్లు మేర పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నది.

పూత రాలిన కంది.. తగ్గిన దిగుబడి:

తుఫాన్ కారణంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలతోపాటు కర్నూలు జిల్లాలోని చాలా ప్రాంతాలలో కంది పంట దెబ్బతిన్నది. ముసురు వల్ల కందిపంటకు పట్టిన పూత రాలిపోయింది. దీంతో మళ్లీ పూత వస్తుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో దాదాపు 6000 ఎకరాలలో కంది సాగు చేశారు. వర్షం కారణంగా నల్లరేగడి, పొలంలో నీటి నిలువ కారణంగా పంట దెబ్బతిన్నది. రెండోసారి పూత వచ్చినప్పటికీ దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.


తుఫాన్‌కు దెబ్బతిన్న ఉల్లి పంట

వర్షానికి తడిసిన వరిపంట:

డిసెంబరు నెలలో వరి కోతలు ఉంటాయి. అయితే ఈ నెలలో తుఫాన్ కారణంగా ఈ ఏడాది వరి పంట బాగా దెబ్బతిన్నది. గాజులదిన్నె ప్రాజెక్టు కింద హంద్రీ పరిసరాలలో ఈ ప్రాంతంతో వరి ఎక్కువగా సాగు చేస్తారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా వరి రంగు మారిపోయింది. గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం మండలాలలో 5000 ఎకరాలలో సాగు చేసిన వరి పంట తుఫాన్ కారణంగా దాదాపు రూ. 2 కోట్ల మేర నష్టం జరిగింది.

ఆసరాగా పంటల బీమా:

అకాలవర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం పంట బీమాను ప్రకటించింది. ఈ నెల 15వ తేదిలోపు పంటల బీమా చెల్లించాలని అధికారులు సూచిస్తున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలలో దాదాపు 5000 మంది రైతులకు పంటనష్టం జరిగినట్లు తెలుస్తున్నది.


పూత రాలిపోతున్న కంది పంట

యునాని మెడికల్ కాలేజీలో పీజీ సీట్లు పెంచండి

● ఆస్పత్రి అభివృద్ధికి నిధులు ఇవ్వాలి
● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
● పార్లమెంట్‌లో గళం వినిపించిన ఎంపీ
● సానుకూలంగా స్పందించిన మంత్రి


పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని డాక్టర్ అబ్దుల్ హక్ యునాని మెడికల్ కళాశాలకు ప్రస్తుతం 50 మెడికల్ సీట్లే ఉన్నాయని, వాటిని పెంచాలని, పీజీ కోర్సు చేసేందుకు వీలుగా సీట్లు కేటాయించాని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్‌లో ఇదే అంశంపై గళమెత్తారు. సంప్రదాయ వైద్యం యునానిపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో 46 శాతం, పట్టణ ప్రాంతాల్లో 54 శాతం యునాని వైద్యం పొందుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని యునాని మెడికల్ కాలేజీ అభివృద్ధిలో భాగంగా పీజీ సీట్లు కేటాయించాలని కోరారు. సంబంధిత శాఖ మంత్రి స్పందిస్తూ ఈ విషయం పరిశీలిస్తామని పార్లమెంట్‌లో స్పష్టమైన హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● అధికారులకు మంత్రి బీసీ ఆదేశం


ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం బనగానపల్లెలోని టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వివిధ గ్రామాలనుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ఎన్‌డీఏ కూటమి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల పక్షాన నిలిచి వారి సమస్యలను సానుకూలంగా విని స్పందించాలన్నారు.

తహసీల్దార్ జీతం జప్తునకు కోర్టు ఆదేశం

కర్నూల లీగల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒక సివిల్ కేసులో కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన నంద్యాల జిల్లా క్రిష్ణగిరి తహసీల్దార్ జీతాన్ని జప్తు చేయాలని ఆదేశిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.మల్లేశ్వరి ఆదేశాలు జారీ చేశారు. వీఆర్వో ఎం.పెద్దమద్దిలేటి కర్నూలు చెందిన ఎం.తిరుపతయ్య నుంచి అప్పు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో కోర్టులో కేసు దాఖలైంది. దీనిపై కోర్టు వీఆర్వో జీతం జప్తు చేయాలని క్రిష్ణగిరి తహసీల్దార్‌కు 2020లో ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ ఉత్తర్వులను తహసీల్దార్ అమలు చేయలేదు. దీంతో కోర్టు తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయినా కూడా తహసీల్దార్ స్పందించకపోవడంతో అతని జీతాన్ని జప్తు చేయాలని ఆదేశిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ కేసును ఈ నెల 16కు వాయిదా వేసింది.

వెయిట్ లిఫ్టింగ్‌లో మేటి

● జాతీయ స్థాయికి చేరుకున్న వెంకటలక్ష్మి
● పసిడి పథకం సాధించిన క్రీడాకారిణి


యువగళం పాదయాత్రలో వెంకటలక్ష్మిని అభినందిస్తున్న నారా లోకేశ్ (ఫైల్)

ఆస్పరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వెంకటలక్ష్మి మారుమూల గ్రామంలో పుట్టారు. రెండేళ్లకే తండ్రి చనిపోయారు. జీవితం పొడవునా అవాంతరాలే. ముందుండి నడిపించేవారు లేరు. అయినా ఆమె ఇక్కడా ఆగిపోలేదు. ఆమె పట్టుదల గొప్పది. పవర్ వెయిట్ లిఫ్టింగ్ 59వ విభాగంలో పసిడి పథకం సాధించారు. మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి విజేతగా గుర్తింపుపొందారు. వీరభద్రి, నరసమ్మ దంపతుల ముగ్గురు కుమార్తెల్లో వెంకటలక్ష్మి రెండో సంతానం. ప్రాథమిక విద్య గ్రామంలోనే. ఇంటర్, వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో ఆసక్తి కనపరుస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించారు. 2022లో విశాఖపట్నంలో నేషనల్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ 59కేటగిరిలో బంగారు పతకాన్ని సాధించారు. తండ్రి లేకపోయినా ఆత్మస్థైర్యంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని పవర్ వెయిట్ లిఫ్టింగ్‌లో గుర్తింపు తెచ్చుకున్నారు. జిల్లా స్థాయి అధికారుల చేత అవార్డులు అందుకున్నారు. కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకొని అక్క చెల్లెళ్లకు వివాహాలు చేశారు. కుటుంబ ఆర్థిక స్థితి బాగా లేకపోవడంతో డిల్లీ నుంచి పిలుపు వచ్చినా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోయారు. ప్రస్తుతం బెంగుళూరులో పార్ట్ టైం ఉద్యోగం చేసుకుంటూ బీపీడీ కోర్సు చదువుతున్నారు. గత ఏడాది యువగళం పాదయాత్ర కైరుప్పల గ్రామం మీదుగా వెళ్లిన ప్రస్తుత ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేత అభినందనలు కూడా అందుకున్నారు.





కర్నూలులో వెంకటలక్ష్మిని అభినందిస్తున్న పోలీసు అధికారులు

● ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తాం

క్రీడలు, స్పోర్ట్స్‌పై ఉన్న ఆసక్తి నన్ను జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తాను..

- వెంకటలక్ష్మి జాతీయ క్రీడాకారిణి

ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

● ధర్నా చౌక్ నుంచి రైతులతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేకంగా తయారైన కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఎస్వీ మోహన్‌రెడ్డి అధ్వర్యంలో శుక్రవారం స్థానిక గౌరీ గోపాల్ ఆసుపత్రి నుంచి రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు వైసీపీ భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు. మద్దతు ధరల లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

కర్నూలు హస్పిటల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ కడప రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీ డాక్టర్ బి.రామగిడ్డయ్య శుక్రవారం జోనల్ పరిధిలో 29 మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్లుగా ఎన్.ప్రవీణ (కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసు), వై.కార్తీక్ (నంద్యాల జిల్లా జిల్లెల పీహెచ్‌సీ), పి.అరుంధతి (నంద్యాల డీఎంహెచ్‌వో కార్యాలయం), ఆర్.నాగేశ్వరి (కర్నూలు ఆర్టీసీ మేల్), పదోన్నతి పొందారు. 15 రోజుల్లో కొత్తగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆర్‌డీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉనికి కోసమే జగన్ తపన

● రైతుల పేరుతో ధర్నాలు చేయడం సిగ్గు చేటు

● నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉనికిని కాపాడుకొనేందుకు మాజీ సీఎం జగన్ రైతుల పేరుతో ధర్నాలు చేయడం సిగ్గు చేటు అని టీడీపీ నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ రైతు వ్యతిరేక విధానాలతో సంక్షోభం తలెత్తిందన్నారు. రైతు భరోసా పేరుతో ఏడాదికి దశలవారిగా రూ.7,500 మాత్రమే ఇచ్చి.. అంతకు ముందు ఉన్న పథకాలు, సబ్సిడీలను నిలిపివేసిందని అన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం ముందు ఉందని అన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతామని చెప్పి కేవలం 677 కుటుంబాలకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ విధానం వల్ల ఒక్కో రైతు కుటుంబంపై సగటున రూ.2.50 లక్షల అప్పు ఉందన్నారు. కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పి మోసగించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు రుణమాఫీ చేశామని ఏడు లక్షల మందికి గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. రబీలో పంటల బీమా చెల్లించకుండా రైతులను జగన్ ముంచారన్నారు. వైసీపీ నాయకులు రైతుల కోసం ర్యాలీ చేస్తుంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు.

ఎకో సెన్సిటివ్ జోన్‌గా రోళ్లపాడు

● 2017 నాటి నోటిఫికేషన్ సవరణకు కేంద్రం నిర్ణయం

● కలెక్టరు ఎక్స్ అఫిషియో చైర్మన్‌గా మానిటరింగ్ కమిటీ





కర్నూలు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా మిడుతూరు మండలంలోని రోళ్లపాడు వన్యప్రాణుల అభయారణ్యంను ఎకో సెన్సిటివ్ జోన్‌గా కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ 2017 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ప్రజాప్రయోజనాలు దృష్ట్యా నోటిఫికేషన్ సవరించాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కర్నూలు జిల్లా కలెక్టర్‌ను ఎక్స్ అఫిషియో చైర్మన్‌గా మానిటరింగ్ కమిటీని కేంద్ర పర్యావరణ శాఖ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో పర్యావరణ రంగంలో సేవలు అందించే ప్రభుత్వేతర సంస్థ ప్రతినిధి ఒకరు సభ్యుడిగా ఉంటారు. అయితే ఈ సభ్యుడిని రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లకోసారి నామినేట్ చేస్తుంది ప్రముఖ సంస్థ, రాష్ట్ర విశ్వవిద్యాలయంలో జీవావరణ శాస్త్రం లేదా పర్యావరణ రంగ నిపుణుడు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా రాష్ట్ర జీవ-వైవిధ్య బోర్డు కార్యదర్శి లేదా సభ్యుడు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, సీనియర్ టౌన్ ప్లానర్ లేదా చీఫ్ అర్బన్ ప్లానర్/సిటీ ప్లానర్, ఎక్స్ అఫిషియో మెంబరు సెక్రెటరీగా అటవీ శాఖ అభయారణ్యం బాధ్యతులు చూసే డిప్యూటీ కన్జర్వేటర్ కమిటీలో సభ్యులుగా ఉంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే జిల్లా పునర్విభజన తరువాత రోళ్లపాడు నంద్యాల జిల్లా పరిధిలోకి వెళ్లింది. ఆ జిల్లా కలెక్టర్ ఈ కమిటీకి చైర్మన్‌గా ఉండే అవకాశం లేకపోలేదు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కురువ రంగముని (ఫైల్)

గోనెగండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని కురువ వీధిలో శుక్రవారం మధ్యాహ్నం అప్పుల బాధ తాళలేక రంగముని (40)అనే రైతు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రంగ మునికి నాలుగు ఎకరాల భూమి ఉంది. దీనికితోడు గోనెగండ్లలోని ఇతర రైతుల వద్ద మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తు న్నారు. అయితే ఇటీవల వరుసగా వ్యవసాయంలో రంగమునికి నష్టం వచ్చింది. పెట్టుబడులు కూడా చేతికి వచ్చేవి కావు. దీంతో ఏటా అప్పు లు పెరిగిపోయాయి. ఈ ఏడాది ఎనిమిది ఎకరాల్లో మిరప, నాలుగు ఎకరాల్లో ఉల్లి, మరో నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంటలు సాగు చేశాడు. మిరప పంటకు వైరస్ సోకడంతో పంట పూర్తిగా దెబ్బ తిన్నది. ఉల్లి, వేరుశనగ పంటలు సరిగా పండలేదు. మూడేళ్లుగా చేసిన అప్పులకు ఈ ఏడాది అప్పులు, వడ్డీలు కలసి దాదాపు రూ.15 లక్షల వరకు రుణగ్రస్థుడయ్యాడు. ఇంత అప్పు ఎలా తీర్చాలో తెలియక మనోవ్యథకు గురయ్యాడు. శుక్రవారం రంగముని ఎమ్మిగనూరులో వేరుశనగ పంటను అమ్మేందుకు వెళ్లాడు. అయితే అక్కడ పంటకు గిటుబాటు ధర పలకకపోవడంతో ఇక చేసిన అప్పులకు వడ్డి కూడా కట్టలేనని భయపడ్డాడు. ఈ మనోవ్యథతో ఇంటికి తిరిగి వచ్చాడు.ఆ సమయంలో భార్య నాగమ్మ, పెద్దకుమారుడు లోకేష్ పొలం పనులకు వెళ్లారు. కూతురు రంగవేణి కిరాణం దుకాణానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పు దూలానికి రంగముని ఉరేసు కున్నాడు. దుకాణం నుంచి ఇంటి వచ్చిన కూతురు ఈ దృశ్యం చూసి కేకలు వేసి ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వారు వచ్చి రంగమునిని గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రంగముని మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య నాగమ్మ, కుమారుడు లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు న్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు

పిల్లలకు పోషకాహారం అందించాలి

● ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యతో పాటు ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ అన్నారు. పోషణ బి-పడాయిబి కింద 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషకాహారంతోపాటు చదువుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. శుక్రవారం స్టేట్ లెవెల్ ట్రైనింగ్ సెంటర్ మహిళ ప్రాంగణంలో సీడీపీవో సూపర్‌వైజర్ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ పీడీ ప్రారంభించారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషకాహారం, చదువు, 0-3 సంవత్సరాల పిల్లలకు నవ మాడ్యుల్ ద్వారా, ఈసీసీఈ ద్వారా ఫిజికల్, అభివృద్ధికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 4 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు అసెస్మెంట్ ద్వారా పిల్లల్లో ఏ స్థాయిలో ఉన్నారో తెలుస్తుందన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారం పిల్లలకు అందిస్తే వారు చదువుకుంటారనీ, అలాగే ఏకాగ్రత, చురుకుగా ఉంటారన్నారు. ఈ శిక్షణలో ఎన్ఐపీసీసీడీ రీజనల్ సెంటర్ బెంగుళూరు ప్రతినిధులు, సీడీపీవో, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దొంగతనం చేస్తే చర్యలు




నిందితుల వివరాల వెల్లడిస్తున్న సీఐ హనుమంతనాయక్

సంజామల, డిసెంబరు 13: దొంగతనాలకు పాల్పడితే చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ హెచ్చరించారు. శుక్రవారం రూ. 3 లక్షల విలువ చేసే విద్యుత్ కేబుల్‌ను దొంగించిన నిందితులను ఎస్ఐ రమణయ్యతో కలిసి ఆయన అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నట్లకొత్తూరు నుండి కమలాపురి వరకు విద్యుత్ సరఫరా చేసే 40 స్తంభాల విద్యుత్ వైర్లను మురళి, చంద్రుడు, పాండురంగుడు అనే వ్యక్తులు దొంగిలించారని తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసున్నామని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 3లక్షలు విలువ చేసే విద్యుత్ వైర్లను స్వాధీనపరుచుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కంది రైతులకు పండుగే

● ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ ధరకు కందుల కొనుగోళ్లు

● కర్నూలులో 67 మెట్రిక్ టన్నులు, నంద్యాలలో 50 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు సన్నాహాలు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం కంది రైతులకు కలిసొచ్చింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందుల ధర రూ.9,900 పలుకుతోంది. దీనికి మరో రూ.100 కలిపి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. కర్నూలు జిల్లాలో 50 వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 43వేల హెక్టార్లలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో కంది పంట సాగైంది. ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా కందిబేడలను తెల్లకార్డు ఉన్న వినియోగదారులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం చక్కెర, రాగులే ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం కందిబేడలను కూడా తెల్లకార్డుపై ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందుల ధర రూ.9,900 దాకా ఉంది. ఈ ధరకు మించి క్వింటంపై రూ. 50 నుంచి రూ. 100 దాకా అధికమైనా రైతుల నుంచే కొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కంది రైతులకు మంచి ఆదాయాలు వచ్చే అవకాశం ఉంది.

● రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ: నంద్యాల జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ హరినాథరెడ్డి:

మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి కందులు కొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండు జిల్లాల్లో కలిపి దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల దాకా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఇటీవల జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిర్ణయమైంది. గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో కందుల విక్రయానికి రైతులు తమ పేర్లను చేయించుకుంటున్నారు.

● వ్యాపారుల అక్రమాలకు చెక్ పెడితేనే న్యాయం

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం రైతుల నుంచి పెద్ద ఎత్తున కందులను కొనాలని నిర్ణయం తీసుకోవడం సంతోషించదగ్గ విషయం. అయితే.. రైతులతో వ్యాపారులు తక్కువ ధరకు కందులను కొని వాటిని మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి బహిరంగ మార్కెట్‌లో అందిస్తున్న ధరకు అమ్ముకుంటున్నారు. దీని వల్ల రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేకపోగా వ్యాపారులే అధికంగా లబ్ది పొందే అవకాశం ఉంది. ప్రభుత్వం దీనిపై చెక్ పెట్టాలి.

దగా పడ్డ మిర్చి రైతు

(5వ పేజీ తరువాయి)

కర్నూలు మార్కెట్ యార్డులో మిర్చి రైతుల్ని వ్యాపారులు అధికారుల అండ చూసుకుని నిండా ముంచుతున్నారు. తూకం వేయాల్సిన సమయంలో సంబంధిత సూపర్‌వైజర్, ఇతర అధికారులు అక్కడ ఉండాల్సింది పోయి.. కార్యాలయాల్లో సేద తీర్చుకుంటున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి రైతులు ఎన్నోసార్లు తీసుకువచ్చినా చలనం లేకపోవడం దారుణం. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి కనిపించింది. తాను తెచ్చిన ఎండుమిర్చి బస్తాలను కాటా వేస్తే దాదాపు 5 నుంచి 10 శాతం మిర్చిని తూకాల్లో చూపకుండా వ్యాపారి స్వాహా చేశాడని ఓ రైతు ఆరోపించాడు. రైతులదంతా ఇదే పరిస్థితి. ఇంత తక్కువ తూకం వేయడం ఏమిటని వ్యాపారులను రైతులు నిలదీశారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, తరుగు కింద ఈ మొత్తాన్ని తీసుకుంటున్నామని, ఇష్టం ఉంటే అమ్మండి.. లేకపోతే వెళ్లిపోమని వ్యాపారులు దమాయించడంతో రైతులు మిన్నకుండిపోయారు. తూకం వద్ద సూపర్‌వైజర్లు, ఆ పై అధికారులు ఉంటే ఈ పరిస్థితి తమకు ఎదురయ్యేది కాదని, ఎన్నోసార్లు సూపర్‌వైజర్, పై అధికారులకు చెప్పినా వ్యాపారులకే వారు వత్తాసు పలకడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

● కార్యాలయాల్లో ముచ్చట్లకే పరిమితం:

కర్నూలు మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లను సూపర్‌వైజర్లు పర్యవేక్షించడం ఆనవాయితీ. అయితే.. సంబంధిత సూపర్‌వైజర్ వారంలో కనీసం ఒక్క రోజు కూడా మిర్చి యార్డులో నిఘా పెట్టిన పాపాన పోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. తూకాల వద్ద వ్యాపారుల అక్రమాలను నిరోధించామని, ఖచ్చితంగా కాటాల వద్ద తూకాలు పూర్తయ్యే వరకు ఉండాలని సిబ్బందిని ఆదేశించామని పై అధికారులు అంటున్నారు. అయితే.. సంబంధిత సూపర్‌వైజర్ మిర్చి యార్డులో ఉండకుండా కార్యాలయంలోకి వ్యాపారులను పిలిపించుకుని ముచ్చట్లు పెడుతుండుతున్నాడని, ఇదేమి దారుణమంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూకాలు సాధారణంగా మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో సూపర్‌వైజర్ కనీసం పది నిమిషాలు కూడా మిర్చి యార్డులో ఉండకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.



కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన ఎండు మిర్చి

● కమీషన్ ఎక్కువ వసూళ్లు చేస్తున్నారు

- చంద్రన్న, పోలకల్, సీ. బెళగల్ మండలం

26 మిర్చి బస్తాలను అమ్మకానికి తెచ్చాను ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. కేవలం 4 బస్తాలకే దిగుబడి పరిమితమైంది. రెండున్నర ఎకరాలకు 1.80 లక్షల ఖర్చు వచ్చింది. నల్లి, తామర తదితర తెగుళ్ల కీటకాల వల్ల దిగుబడి దారుణంగా పడిపోయింది. కనీసం యార్డులో గిట్టుబాటు ధర అందుతుందోనని నమ్మకం పెట్టుకున్నాను. అయితే 4 శాతం కమిషన్ వ్యాపారులు ముక్కు పిండి వసూలు చేశారు. తక్కువ తూకంతో భారీగా నష్టపోయాను. కాటా యంత్రం వద్ద ఏ అధికారి రాకపోవడం మరింత నష్టానికి దారి తీసింది.

● ఇంత దారుణం గుంటూరు యార్డులో లేదు

- మల్లికార్జున, రైతు

మమ్మల్ని వ్యాపారులు దారుణంగా ముంచేస్తున్నారు. యార్డులో లక్షల్లో జీతభత్యాలు తీసుకుంటున్న సూపర్‌వైజర్, అధికారులు మా గోడు వినిపించుకోవడం లేదు. కార్యాలయాల్లో వారు వ్యాపారులతో మాట్లాడుకుంటూ కూచున్నారు. తక్కువ తూకాలతో నిండా మునుగుతున్నాము. కమిషన్ కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో దిక్కు తోచడం లేదు.

● వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం

-జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

మిర్చి యార్డులో మిర్చిని తూకం వేసే సమయంలో ఖచ్చితంగా సూపర్‌వైజర్లు, సెక్రటరీలు నిఘా పెట్టాల్సిందే. ఈ మేరకు వారికి ఆదేశాలు కూడా ఇచ్చాము. ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా సంబంధిత సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటాము. వ్యాపారుల లైసెన్సులను సస్పెన్షన్ చేస్తాము.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

ప్రియురాలు పట్టించుకోవడం లేదని...

● కొలిమిగుండ్లలో విషాదం



శ్రీహర్ష (ఫైల్)

కొలిమిగుండ్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి పట్టించుకోవడం లేదని, మాట్లాడటం ఆపేసిందని మథనపడిన ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొలిమిగుండ్ల మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కొలిమిగుండ్లకు చెందిన ఉపాధ్యాయురాలు శ్రీదేవి, మద్దిరెడ్డి జనార్దన్ దంపతుల పెద్ద కుమారుడు మద్దిరెడ్డి శ్రీహర్ష(20) గుజరాత్ రాష్ట్రంలోని పారూల్ యూనివర్సిటీలో బీబీఏ(డిగ్రీ) మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే అదే కాలేజీలో మరో కోర్సు చదువుతున్న అమ్మాయితో సన్నిహితంగా ఉంటూ ప్రేమించాడు. అయితే ఇటీవల కొద్ది రోజులుగా ఆ అమ్మాయి శ్రీహర్షతో మాట్లాడకుండా దూరం పెట్టింది. దీంతో యువకుడు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కళాశాలలో మనోవేదనకు గురై అనారోగ్యం బారిన పడ్డాడు. తోటి స్నేహితుల ద్వారా సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు పది రోజుల క్రితం గుజరాత్‌కు వెళ్లి కుమారుడిని ఇంటికి తీసుకొచ్చి వైద్యులతో చికిత్సలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం తల్లి శ్రీదేవి వృత్తిరీత్యా స్కూల్‌కు వెళ్లగా, తండ్రి జనార్దన్ బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుమారుడి భవిష్యతు బాగుండాలని కాంక్షించిన తల్లిద్రండులకు శ్రీహర్ష ఆత్మహత్య కడుపుకోతను మిగిల్చింది. చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచి, లక్షలు ఖర్చు చేసి ఉన్నతమైన విద్యా సంస్థలో చేర్పిస్తే.. ఇలా చేశావా? అంటూ రోదించిన తల్లిదండ్రుల ఆవేదన అందరినీ కలచివేసింది.

కుక్కల బెడద నివారణకు చర్యలు

నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి కుక్కల బెడద నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం గార్గేయపురం డంప్ యార్డులోని కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల బెడద ఎక్కువ అయినట్లు ప్రజాప్రతినిదులు, ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు డంప్ యార్డులో ఉన్న కుక్కల సంతాన నియంత్రణ కేంద్రంలో ప్రతిరోజు 20 కుక్కలకు ఆపరే షన్లు చేయ డానికి సౌకర్యాలు ఉన్నాయన్నారు. అదనంగా మరో 15 కుక్క లకు అపరే షన్లు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకు సంబం ధించిన నిర్మాణాలను చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొం దించామన్నారు. వీటి నిర్వహణ కోసం యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా(ఏడబ్ల్యూబీఐ) మార్గదర్శకాలను పాటించా మన్నారు. అక్కడి


కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

నుంచి త్వరలో అనుమతులు వస్తాయన్నారు. వచ్చిన వెంటనే తొలి దశగా ప్రతి రోజు 20 కుక్కలకు ఆపరేషన్లు నిర్వహిస్తా మన్నారు. ఆయన వెంట వెటర్నరీ వైద్యులు డాక్టర్ మల్లన్న, డీఈఈ గంగాధర్ ఉన్నారు.

ఐదో రోజూ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

మద్దతు తెలిపిన పీపీఎస్ఎస్ నాయకులు

కర్నూలు న్యూసిటి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె శుక్రవారానికి ఐదో రోజుకు చేరింది. నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మెలో పట్టణ పౌర సంక్షేమ సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ. పుల్లారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిం చారు. గత ఐదు రోజు లుగా సమ్మె చేస్తున్న పట్టించుకోని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పా లన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ ఇంజ నీరింగ్ కార్మికుల యూనియన్ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, నగర అధ్య


సమ్మెలో పాల్గొన్న పీపీఎస్ సంఘం నాయకులు


గూడూరులో వంటవార్పుతో నిరసన తెలుపుతున్న కార్మికులు

క్షుడు జి.వెంకటేశ్వర్లు, నాయకులు కాశపోగు జ్ఞానమ్మ, షేక్షావలి పాల్గొన్నారు.

గూడూరులో వంటవార్పుతో కార్మికుల నిరసన

గూడూరు: గూడూరులో నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం ఐదో రోజుకు చేరుకుంది. శుక్రవారం నగర పంచాయతీ కార్మికులు వంటవార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మి కులు మధు, దూకేశ్వరరావు, అరవింద్ మాట్లాడుతూ ఇప్పటికైన ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులు న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర పంచా యతీ ఇంజనీరింగ్ కార్మి కులు బసవరాజు, షబ్బీర్ బాషా, జయన్న, మధు, హరి, ఖాజా హుసేన్, వెంకటేశ్వర్లు, పఠాన్, రజాక్ పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి: సీపీఎం


విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ/కల్లూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం నగర పాలక పరిధిలోని 84, 85 సచివాలయాలు, 23వ వార్డు, 27వ వార్డు షరీన్నగర్, క్రిష్ణానగర్ ఐటీసీ వద్ద విద్యుత్ బిల్లులను దహనం చేసిన నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు విజయ రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభు త్వం ఎలాంటి చార్జీలు పెంచబోమని చెప్పి ప్రజలను పూర్తిగా మోసం చేసిం దని ఆరోపించారు. వెంటనే పెంచిన విద్యుత్, ట్రూప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, హుస్సేన్‌బాషా, ఆర్.నరసింహులు, సీహెచ్.సాయిబాబా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి: ఎంపీడీవో

ఓర్వకల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాల యంలో శుక్రవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యద ర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎన్నో రకాల ప్రణాళికలు పంచాయతీ ద్వారా తయారు చేస్తామన్నారు. అవన్నీ జీవనాధారంగా ఉన్నప్పుడు మాత్రమే జరిగిన అభివృద్ధికి సార్థకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్బరాయుడు, ఇంజనీర్లు శ్రీనివాసులు, నరేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పుస్తకాల పరిచయ సభ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని భావనాప్రియ సాహితీ వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటలకు పుస్తకాల పరిచయ సభ ఏర్పాటు చేసినట్లు వేదిక ప్రతిని దులు తెలిపారు. నగరంలోని సి.క్యాంపులోగల టీజీవీ కళాక్షేత్రంలో జరిగే ఈ సభలో గనుమాల మునుస్వామి రాసిన స్వామి సంకీర్తనం, శ్రీహరి సంకీర్తనా తోరణం (కీర్తనలు), భక్తులత రాణిలాలవతి రాసిన మనోజ్ఞ వీచిక(నానీలు), డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు రాసిన తెలుగు ఘనత(పద్యం), రేవుల శ్రీనివాసులు రాసిన అందాల రాక్షసి (కంద పద్యాలు), పుట్టా పెనుగొండయ్య రాసిన సీమ చరిత శతకం పుస్త కాలను పరిచయం చేస్తారని తెలిపారు. ఈ పుస్తకాలకు సమీక్షకు లుగా రచయితలు కేవీ సుబ్బలక్ష్మి, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, ఆవుల చక్రపాణి యాదవ్, బైరోజు రాజశేఖర్, భక్తుల రాణి లీలావతి, డాక్టర్ దండె బోయిన పార్వతీదేవి వ్యవహరిస్తారని వారు పేర్కొన్నారు.

రైతులను అడ్డం పెట్టుకుని ధర్నాలు చేయడమా..?

కర్నూలు అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతుల నడ్డి విరిచి .. మళ్లీ వారినే అడ్డు పెట్టుకుని ధర్నాలు చేయడం సిగ్గుచేటని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికా రంలో ఉండగ రైతాం గానికి సకాలంలో పంట రుణాలు అందజే యలేదని, విత్తనాలు, ఎరువులు, అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. పంటలను కొనుగోలు చేసి వారికి చెల్లించాల్సిన పంట బకాయిలను సైతం కూటమి ప్రభుత్వం చెల్లించి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం హామీలన్నింటిని ఒక్కొక్కటిగా అమలు పరుస్తున్నదన్నారు. వైసీపీ చేపట్టిన ధర్నాకు రైతులు లేరన్నారు.

ఆగ్రానమి ఏడీఏగా అరుణ కుమారి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జేడీఏ కార్యాలయంలో ఆగ్రానమి ఏడీఏగా అరుణ కుమారి నియమితులయ్యారు. గతంలో ఈమె ఆదోని ఏడీఏగా పని చేశారు. జేడీ కార్యాలయంలో పని చేస్తున్న బాలమర్దిరాజు ఆదోని ఏడీఏగా బదిలీపై వెళ్లారు.

జూదరుల అరెస్టు

సి.బెళగల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సి.బెళగల్‌కు సమీపంలో పేకాట ఆడుతుండగా ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసులతో దాడి చేసి వారి దగ్గర నుంచి రూ.4,100 వేలు, మూడు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసు కున్నారు. మరికొంత మంది పరారీ అయ్యారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

తెరుచుకున్న పెట్రోల్ బంకు


పెట్రోలు పోయించుకుంటున్న వాహనదారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పాతబస్టాండు సమీపంలో నగర పాలక సంస్థ(కేఎంసీ)కి సంబంధించి పెట్రోల్ బంకు మూతపడిందని 12న 'ఆంధ్ర జ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేర కు అధికారులు స్పందించారు. పెట్రోలు బంకుకు సంబంధించి 10 వేల లీటర్లు పెట్రోలు, 10 వేల లీటర్ల డీజిల్‌ను తెప్పించారు. దీంతో వాహదా రుల ఇబ్బందులు తొలగిపోయాయి. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపంతోనే పెట్రోల్ బంకు మూత పడిందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కమిషనర్, అడిషనల్ కమిషనర్ సీరియస్ అయినట్లు తెలిసింది. అంతే కాకుండా కథనం వచ్చిన వెంటనే అడిషనల్ కమిషనర్ పెట్రోల్ బంకును సందర్శించి అక్కడి సిబ్బందితో విషయాలను తెలుసుకున్నారు.

సాగునీటి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి: తహసీల్దార్

ఓర్వకల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ మండలంలోని శకునాల గ్రామంలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. అందులో 114 మంది ఓటర్లు ఉన్నారని, ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పా టు చేశామని, మూడు కేంద్రాలు సచివాలయంలో, మరో మూడు కేం ద్రాలు ఆర్బీకేలో ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా ఎన్ని కైన నీటి సంఘాల అధ్యక్షుల ద్వారా పంట కాలువలు, చెరువులను అభి వృద్ధి చేస్తారని ఆయన తెలిపారు.

సి.బెళగల్: మండలంలో శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో కంబదహాల్, మాలేసోమాపురం, సి.బెళగల్, పలుకుదొడ్డి తదితర గ్రామాల రైతులు ఆయా కేంద్రాల్లో ఓటు వేయాల న్నారు. అనంతరం ఆయా గ్రామాలలో నిర్వహించే సాగునీటి సంఘం ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ తిమ్మారెడ్డి పరిశీలించారు.

నేడు దత్త జయంతి


విద్యుద్దీపాలంకరణలో పాతబస్టాండ్‌లోని సాయిబాబా ఆలయం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): త్రిమూర్తుల స్వరూ పంగా కొలిచే దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలను శనివారం నగరంలో ఘనంగా జరుపుకొనున్నారు. ఈ సందర్భంగా నగరంలోని సాయిబాబా ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. నగరంలోని దక్షిణ షిరి డీగా వినతికెక్కిన సాయిబాబా ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు, అఖండ సాయి నామ సంకీర్తనలు, భజనలు, ప్రసాద వితరణలు చేపట్టారు. అశోక్ నగర్‌లోని హనుమాన్ ద్వారకామాయి ఆలయంలో, పాత నగరంలోని నాగ సాయి ఆలయంలో, వెంకటరమణ కాలనీలోని సాయి మందిరంలో ప్రత్యేక పూజలు, విశేష హారతిలు నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నెలవారి విద్యుత్ లైన్లు, పోల్స్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో కరెంట్ కోత ఉటుందని ఏడీఈలు రాజేంద్రబాబు, నాగప్రసాద్, సుబ్బన్న తెలిపారు. నగర ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

ఓర్వకల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి అర్జీలు స్వీక రించారు. పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బుగ్గపూటి నాగిరెడ్డి మా ట్లాడుతూ గ్రామా నికి వెటర్నరీ హాస్పిటల్, పొదుపు భవనానికి స్థలం కేటాయించాలని, ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఈవో మద్ది లేటి, నాయకులు రాజశేఖర్, పెద్దన్న, ఆంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

సి.బెళగల్: రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండా పురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మా ట్లాడుతూ రెవెన్యూ సదస్సుకు 16 దరఖాస్తులు వచ్చాయన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూషణం పాల్గొన్నారు.

మండల అభివృద్ధిపై కలిసి పోరాడుదాం


సీపీఎం ప్రాంతీయ మూడో మహాసభల్లో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మలమ్మ

గూడూరు డిసెంబరు 13: మండల అభివృద్ధిపై కలిసి పోరాడుదామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మలమ్మ అన్నారు. శుక్రవారం గూడూ రులో స్థానిక వీరభద్రస్వామి కల్యాణ మండపంలో సీపీఎం ప్రాంతీయ 3వ మహాసభలు రాజశేఖర్, ఖాజా హుస్సేన్‌ల అధ్యక్షతన జరిగాయి. ఈకార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిర్మలమ్మ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ నారాయణ హాజరై మాట్లాడారు. గూడూ రులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.54 కోట్లతో నిర్మిస్తున్న తాగునీటి పథకం మధ్యలోనే నిలిచిపోయిందని, తక్షణమే అధికారులు స్పందించి పథకాన్ని పూర్తి చేయాలన్నారు. వలసల నివారణకు గూడూరు పట్టణంలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలన్నారు. సీపీఎం ప్రాం తీయ కార్యదర్శి జె మోహన్, కమిటీ సభ్యులుగా రాజశేఖర్, వెంకటేశ్వర్లు, కోటేశ్వ రయ్య, రవి, ఇబ్రహీం, శేషమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీడీపీ సభ్యత్వం నమోదు


టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

గూడూరు డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో శుక్రవారం టీడీపీ ప్రధాన కార్యదర్శి కె కృష్ణ అధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం చేసుకుంటే ప్రమాద బీమా కింద రూ.5లక్షలు ఇస్తుం దన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మద్ది లేటి, టీడీపీ నాయకులు కర్ణం చిన్న గిడ్డయ్య, హలీఫ్ బాషా పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న గిద్దేశ్వర్లు

సి.బెళగల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీల రిసోర్స్‌పర్సన్ గిద్దేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యా లయం సమావేశ భవనంలో మండలంలోని పంచాయతీ కార్యద ర్శులు, సర్పంచులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు, కార్య దర్శులు సమన్వ యంతో కలిసి పనిచేసినప్పుడే పంచాయతీలు అభివృద్ధి చెందుతా యన్నారు. ఈసమావేశంలో ఎంపీడీవో రాణెమ్మ, ఈవోఆర్డీ ఈశ్వరస్వామి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అన్ని టీసీలను కైవసం చేసుకుంటాం: టీడీపీ

గూడూరు డిసెంబరు 13: సాగునీటి సంఘం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అన్ని టీసీలను కైవసం చేసుకుంటందని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. శుక్రవారం గూడూరులో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి రైతులను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి సంబంధించి ఐదు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయని, అందులో డబ్ల్యూయూఏ-44 గూడూరు, డబ్ల్యూయూఏ- 50 ఆర్ కానాపురం, డబ్ల్యూయూఏ - 55 కె నాగలాపురం, యంబ ట్యాంక్ కత్వ వాగు చెరువు, తిమ్మాపురం చెరువు ఆర్ కానాపురం సాగునీటి సంఘాలే ఉన్నాయని, అన్ని టీసీలను టీడీపీ కైవసం చేసుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు రేమట వెంకటేశ్వర్లు, పుట్టపాశం రామాంజనేయులు, ఎస్ఈ భాస్కర్ పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నాటు సారా స్థావరాలపై దాడులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 13(ఆంధ్ర జ్యోతి): నగరంలోని బంగారు పేటలో నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు చేశామని ఎక్సైజ్ సీఐ కే.చంద్రహాస్ తెలిపారు. శుక్రవారం డిటీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్‌తో కలిపి పలు కాలనీల్లో తనిఖీలు చేశారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 2400 లీటర్ల బెల్లం ఊట, 35 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. గోనేలనాగదుర్గ వద్ద 20 లీటర్లు సారా ను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని అదు పులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలి పారు. ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

కల్లూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే గోకులం షెడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటిం చాలని రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ విజయభాస్కర్ ఆదేశించారు. శుక్రవారం కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామంలో కర్నూలు, ఎమ్మిగనూరు సాంకేతిక, ఇంజనీరింగ్ సహాయకులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గోకులం షెడ్లు నిర్మించుకుంటున్న రైతులకు నాణ్యత, కొలతల నమోదు అంశాలపై వివరించాలన్నారు. జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాద్రి, ఏపీడీ లక్ష్మన్న, కృష్ణమోహన్, కోర్స్ డైరెక్టర్ ఎర్రమల, సురేష్, ఏపీఓ మద్దీశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న విజయభాస్కర్

సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి విద్యార్థులు

ఓర్వకల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం మరణించడంతో ఆయన కుటుంబానికి శుక్రవారం కాకతీయ పబ్లిక్ స్కూల్ 1996-1997 బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులు రూ.లక్ష బ్యాంకులో డిపాజిట్ చేశారు. కళ్యాణ్, శివారెడ్డి, మధు, రాజు నాయక్, రవికుమార్, చక్రపాణి, శేఖర్, రమణ పాల్గొన్నారు.

17న ఈఎస్‌టీ క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్


మాట్లాడుతున్న చైర్మన్ బి.జయాకర్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏవాంజెలికల్ సపో ర్టింగ్ టీం ఆధ్వర్యంలో ఈనెల 17న ఎస్‌టీబీసీ కాలేజీలో సాయంత్రం 7 గంటలకు ఈఎస్‌టీ క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ జరుగుతుందని కమిటీ చైర్మన్ బి.జయాకర్ తెలిపారు. శుక్రవారం స్టాంటన్ మెమోరియల్ చర్చి లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్ర మానికి ముఖ్య సంగీతకులు రెవ.డా.గంటా కరుణాసాగర్ హాజరై తమ సందేశాన్ని ఇస్తారన్నారు. ముఖ్యఅతిథులుగా రెవ.ఆర్‌ఆర్‌డీ సజీవరాజు, మున్సిపల్ కమిషనర్, కర్నూలు డీఈవో పాల్గొంటారని తెలిపారు. కార్యక్ర మంలో ఈఎస్‌టీ ఫౌండర్ దాసరి సుధీర్, కమిటీ వైస్ చైర్మన్ సురేష్, సెక్రెటరీ బాను, ట్రెజరర్ రాజు, అడ్వైజర్ డేవిడ్ పాల్ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురం పట్టణంలో ఈనెల 14వ తేదీ నుంచి 15 వరకు జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలని గుడ్ షప్పర్డ్ పాఠశాల కరస్పాండెంట్ ఏసుదాసు అన్నారు. శుక్రవారం జిల్లా మహిళా జట్టుకు పాఠశాల క్రీడా మైదానంలో ఆయన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి పరుశురా ముడు, జిల్లా కార్యదర్శి నాగరాజు, అసోసి యేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మహిళా జట్టును కోచ్ సురేష్ కుమార్ ప్రకటించారు.


క్రీడాకారులతో అతిథులు

బేస్‌బాల్ జట్టు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో శనివారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు జరుగుతాయని సంఘం అధ్య క్షుడు పరమేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం బాలురు, బాలికల టీమ్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

స్వర్ణాంధ్ర విజన్ 2047.. చారిత్రాత్మకం

ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 ఒక చారిత్రాత్మకమైన ఘట్టమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 రాష్ట్ర దశ-దిశను మారుస్తుందని స్పష్టం చేశారు. ఇందులో ముఖ్యంగా విద్య, ఆరోగ్యం అన్ని వర్గాల సాధికారత, సుపరిపాలన అనే నాలుగు అంశాలు ప్రధానంగా ఉంటాయని తెలిపారు.

సీజనల్ హాస్టల్ ప్రారంభం

హొళగుంద, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హొళగుందలోని ఎస్సీ కాలనీలో సీజనల్ హాస్టల్ ప్రారంభించినట్లు ఉషోదయ గ్రామీణ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు చిన్నహ్యాట్ల నాగరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలస వెళ్లిన వారి పిల్లల సంరక్షణకు గాను సీజనల్ హాస్టల్‌ను ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి సత్య నారాయణ, ఎస్ఐ బాల నరసింహుడు హాజరయ్యారు.

అభివృద్ధికి అందరి సహకారం అవసరం

ఆలూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఎంపీడీవో సూర్యనారాయణ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో స్వయం సమృద్ధి లక్ష్యాలు అనే అంశంపై రెండో రోజు ఈవోపీఆర్డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రమాదేవి పాల్గొన్నారు.

పశుగణన సర్వేకు రైతులు సహకరించాలి


పశుగణన సర్వే చేస్తున్న పశువైద్యాధికారి కృష్ణ నాయక్

మద్దికెర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పశుగణన సర్వేకు రైతు లు సహకరించాలని పశువైద్యాధికారి కృష్ణ నాయక్ కోరారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో ఇంటింటి జరుగుతున్న పశుగణన సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండ లంలో మొత్తం 8,340 ఇళ్లు ఉండగా నేటికి 3949 ఇళ్ల సర్వే చేశామ న్నారు. పశువులకు ఉచిత టీకాలు, మందులు తదితర ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో పల్లెలకు మహర్దశ

మద్దికెర, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వంలో పల్లెల కు మహర్దశ పట్టుకుందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌద రి, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని బసినేపల్లి గ్రామంలో రూ.8 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ తిమ్మప్ప, తెలుగు యువత నాయకులు హరినాథ్‌గౌడు, ఏఈ విష్ణు, మాజీ సర్పంచ్ ఆకుల ఆనంద్, వీఆర్వో శివన్న పాల్గొన్నారు.

కణితి తొలగింపు

పత్తికొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మహిళ కడుపులో పెరుగుతున్న 3.45 కిలోల కణితిని ఆపరేషన్ ద్వారా పత్తికొండ శ్రీరామ ఆసుపత్రిలో వైద్యులు శుక్రవారం తొలగించారు. పత్తికొండ మండలం జూటూరు గ్రామానికి చెందిన రామాంజినేయుల ఎ భార్య శృతి కడుపు నొప్పితో శ్రీరామ అసుపత్రికి రావడంతో కడుపులో కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఎన్టీఆర్ వైద్య సేవల కింద వైద్యులు కల్పన, మల్లికార్జునరెడ్డిలు ఆపరేషన్ చేసి కణితిని తొలగించారు. ప్రస్తుతం శృతి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఏకగ్రీవం కోసం ఎత్తులు

- పావులు కదుపుతున్న అధికార పార్టీ
- పట్టుకోసం వైసీపీ ప్రయత్నాలు
- సాగు నీటి సంఘాల ఎన్నికలతో వేడెక్కిన పల్లెలు

సాగు నీటి సంఘాల ఎన్నికలతో పల్లెలు వేడెక్కాయి. ఏకగ్రీవం కోసం అధికార పార్టీ ఎత్తులు వేస్తుండగా పట్టుకోసం వైసీపీ ప్రయత్నాలు చేస్తోంది. శనివారం జరగనున్న ఈ ఎన్నికల ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.


సాగు నీటి సంఘ ఎన్నికలపై సమీక్ష జరుపుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్


ఎన్నికల కోసం బాక్స్‌లు సిద్ధం చేస్తున్న సిబ్బంది


సాగు నీటి సంఘాల ఎన్నికలపై వైసీపీ నాయకులతో ఎమ్మెల్యే విరుపాక్షి సమీక్ష

ఆలూరు, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే హద్దుల ఖరారు, ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఎన్నికల అధి కారులకు శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తి చేశారు. ఇక మిగిలిన పోలింగ్ ప్రక్రియకు బుధ వారం నోటిఫికేషన్ విడుదలైంది. ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో మొత్తం 5 సాగు నీటి సంఘాలు (డబ్ల్యూఏ) పదవులకు ఎన్నికలు ఈ నెల 14న జరగనున్నాయి. పోలింగ్ ఆయా గ్రా మంలోని రైతు భరోసా కేంద్రాలు, సచివాల యంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పా ట్లు చేస్తున్నారు. 14వ తేదీన డబ్ల్యూఏలకు సంబంధించి సభ్యులు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ను స్థానిక రైతులు ఎన్నుకుంటారు. ఇక అదే రోజున డీసీలకు సంబంధించి ఎన్నికకు అధికా రులు నోటిఫికేషన్ ఇస్తారు. వీరంతా కలిసి 17వ తేదీన డీసీ పాలక వర్గాలను ఎన్నుకుం టారు. ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీ పాలక వర్గాల ఎన్నిక జరుగుతుంది.

ఆరు అధ్యక్ష పదవులకు ఎన్నికలు

ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో మొత్తం ఆరు (డబ్ల్యూఏ) అధ్యక్ష పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో చింతకుంట, డేగుల పాడు, చిప్పగిరి, రామదుర్గం, హత్తిబేలగల్, అర్ధ గేరి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆరు సంఘాల పరిధిలో మొత్తం పది వేలకు

ఏకగ్రీవానికి ప్రయత్నిస్తున్నాం

సాగునీటి సంఘాల ఎన్నికల్లో అన్ని ఏకగ్రీవమయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాల యంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

పైగా ఓటర్లు ఉన్నారు. ఇందులో అర్ధగేరి, రామదుర్గం, హత్తిబెలగల్, చింతకుంట సాగు నీటిసంఘాలకు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, మాజీ జడ్పీటీసీ మీనాక్షి నాయుడు, సీనియర్ నేతలు తిమ్మయ్య ఇతర నేతలు ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు ఎమ్మెల్యే విరుపాక్షి కూడా తమ వర్గీయులను బరిలో దింపేందుకు పావులు కదుపుతు న్నారు. ఇందులో నాలుగు సంఘాలను ఏకగ్రీ వం చేసుకున్న వారికే ఆలూరు బ్రాంచ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడి పదవి దక్కనుంది. టీడీపీ నుంచి నగరడోన కిష్టప్ప, వైసీపీ మంచి ఏరూర్ మహేష్ బరిలో నిలిచారు. ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దా ర్ గోవింద్‌సింగ్ శుక్రవారం తెలిపారు.

● **మద్దికెర:** మండలంలోని బసినేపల్లిలో జరుగుతున్న నీటి సంఘం ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావే శం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎన్నికలకు మొత్తం 252 మంది ఓటర్ల రైతులు తమ ఓటు హక్కును వినియోగించు కుంటారని అన్నారు. మధ్యాహ్నం నుంచి అధ్య క్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయని తెలిపా రు. కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, వీఆర్వో లు రంగస్వామి, రషీదు, శ్రీరాములు, స్వర్ణమ్మ, తదితరులు ఉన్నారు.

● **వెల్దుర్తి:** మండలంలో ఆరు చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వ హిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ శుక్ర వారం తెలిపారు. పట్టణ సమీపంలోని ఈరన్న గట్టు, కాంధాన్ చెరువులకు, గోవర్ధనగిరి, నర్సా పురం, సూదెపల్లి, ఎల్.నగరం గ్రామాల చెరువు లకు ఎన్నికలు నిర్వహించేందుకు ఆయా శాఖ అధికారులను సిద్ధం చేసినటు వెల్లడించారు. ఆయకట్టుకు కింద రైతులందరూ ఈ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ హుశేన్ సాహెబ్


దేవనకొండలో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సతీష్


రైతుల సమస్యలు విన్నవిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిం చేందుకే రెవెన్యూ సదస్సులను అమలు చేసిం దని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ మండలంలో రైతులు వ్యవ సాయ పొలాలకు సంబంధించి ఏవైనా ఉంటే ఈ సదస్సు ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నా రు. రెవెన్యూ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తెలిపారు. మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూసర్వే వల్ల చాలా మంది రైతులు తమ పొలాలకు సంబంధించి తక్కువగా ఉండటంతో అర్జీలను పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నా రు. అలాంటి వారందరికీ ఈ రెవెన్యూ సదస్సు లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్ర మంలో ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వా మి, శ్రీరాములు, సువర్ణమ్మ, హర్షవర్ధన్, దేవాల య సిబ్బంది రఘు తదితరులు ఉన్నారు.

దేవనకొండ: ప్రభుత్వం నిర్వహించే రెవె న్యూ సదస్సులతో రైతుల సమస్యలు పరిష్కా రమవుతాయని తహసీల్దార్ లోకేశ్వరయ్య, దేవ దాయశాఖ అధికారి నర్సయ్య అన్నారు. మండ లంలోని కుంకనూరు సచివాయం వద్ద శుక్రవా రం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూమి కొలతలు, పేరు మార్పులు, సవరణలు వంటి వాటిపై ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. కార్య క్రమంలో మండల సర్వేయర్ శ్యామ్‌కుమార్, ఆర్ఐ విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

తుగ్గలి: భూ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బర్మా వీరేష్, రైతులు కోరారు. శనివారం మండ ల పరిధిలోని పెండేకల్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి స్పెషల్ అధికారి సుధాకర్, తహ సీల్దార్ రమాదేవిలు రైతుల అర్జీలను స్వీకరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూ సమస్యలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సర్వేయర్ సుధాకర్, సర్పంచ్ లీలావతి, ఫారెస్టు ఆఫీసర్ లక్ష్మన్న ఉన్నారు.

హొళగుంద: ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహి స్తోందని హొళగుంద తహసీల్దార్ కె.సతీష్, డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్ శుక్రవారం అన్నారు. లింగంపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ గతంలో నిర్వహించిన రీ సర్వేలో భూ సమస్యలు తలెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నట్లు కూటమి ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. అందుకే రైతుల సమ స్యలను వారి గ్రామాల్లోనే అధికారుల సమక్షం లో పరిష్కరించేందుకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెం ట్ అధికారి నరేంద్ర పాల్గొన్నారు.

వెల్దుర్తి: చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు తహసీల్దార్ చంద్రశే ఖర వర్మను కోరారు. శుక్రవారం మండలంలో కలగొట్ల గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖర వర్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించా రు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్య క్రమంలో సర్పంచ్ మద్దిలేటి, టీడీపీ గ్రామ నాయకుడు రామకృష్ణ, సర్వేయర్ హేమంత్ రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారించేందుకే రెవెన్యూ సదస్సు లు నిర్వహిస్తోందని గోవింద్ సింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అరికేర గ్రామం లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం శాశ్వ తంగా భూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తోం దని చెప్పారు. గ్రామాల్లో భూ తగాదాలు లేకుం డా రైతులు మేలు చేసే విధంగా చర్యలు తీసు కుంటామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి కుప్పగళ్లు నాగరాజు, సర్వేయర్ అరుణ జ్యోతి, వీఆర్వో రవికుమార్, లింగన్న, వన్నూరు, లోక వీర్ పాల్గొన్నారు.


వెల్దుర్తిలో రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరవర్మ



అరికెరలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ గోవిందు సింగ్

ఆడపిల్లలను చదివిద్దాం


ఆడపిల్లలను చదివిద్దాం పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

మద్దికెర, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లలను చిన్నచూపు చూడకుండా పురుషులతో సమానంగా చదివిద్దామని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నాగప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆడపిల్లలను చదివిద్దాం.. రక్షిద్దాం అనే కార్యక్రమంపై పోస్టర్‌ను విడుదల చేసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వవైద్యాధికారి రాగిణి, సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా తదితరులు ఉన్నారు.

చేపల పెంపకానికి పోటాపోటీగా వేలాలు


జొన్నగిరిలో చేపల వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

తుగ్గలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపల పెంపకానికి వేలం పాటలు పోటపోటీగా జరిగాయి. శనివారం మండల పరిధిలోని జొన్నగిరిలో చెరువులో చేపల పెంపకానికి ఈవోఆర్డీ శ్రీహరి, సర్పంచ్ ఓబులేసు ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మీసాల శేఖర్ రూ.7 లక్షలకు వేలం పాట దక్కించుకున్నాడు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నారాయణ స్వామి, విద్యాకమిటి చైర్మన్ రవి యాదవ్, బాలన్న, లక్ష్మణ స్వామి యాదవ్ తదితరులు ఉన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా కోసం కృషి

తుగ్గలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఏఈ మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు చేపట్టడంతో పాటు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చడంతోపాటు అధిక లోడు కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్యవసాయ తోటలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఈయన వెంట లైన్‌మెన్లు రామదాసు, వెంకటేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

సుస్థిరాభివృద్ధికి పాటుపడాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

దేవనకొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో సచివాలయ అధికారులు సుస్థిరమైన అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీవో గౌరిదేవి, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ అన్నారు. ఎంపీడీవో సమావేశ భవనంలో మండంలోని పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, పశువైద్య సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్వోలు, సర్వేయర్లతో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో సువర్ణలత అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండో రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖ, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు శాఖల పరిధిలో జరుగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు.

నాణ్యమైన భోజనం అందించండి: డీఈవో


సీజనల్ హాస్టల్ విద్యార్థులతో డీఈవో శ్యామ్యూల్ పాల్

క్రిష్ణగిరి, డిసెంబరు 13: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిం చాలని డీఈవో శ్యామూల్ పాల్ అన్నారు. శుక్రవారం కోయిలకొండ గ్రామంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ కష్టపడి చదువుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని అన్నారు.

లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేయాలి


నారా లోకేశ్‌ను కలిసిన బాదడ కౌశిక్ కుమార్

తుగ్గలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ వీరశైవ లింగాయత్‌ల రాష్ట్ర సాధికారిత కమిటీ సభ్యులు బాదడ కౌశిక్ కుమార్ అన్నారు. శనివారం మంగళ గిరిలో మంత్రి నారా లోకేశ్‌ను బాదడ కౌశిక్ కుమార్, ఆయన సతీమణి ఝాన్సీలు కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి నారా లోకేశ్ స్పందించి లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారన్నారు.

కలగొట్లలో డ్రైనేజీ కాలువల నిర్మాణం

వెల్దుర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలగొట్ల గ్రామంలో దళితవాడ, మండల పరిషత్ ఆదర్శ పాఠశాల (బీసీ కాలనీ) కాలనీల్లో సర్పంచ్ మద్దిలేటి పంచాయతీ నిధులతో డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ కాలువ నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్య పరిశీలించారు. సర్పంచ్ మద్దిలేటి మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, జిల్లా నాయకుడు సుబ్బరాయుడు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

రాంజల చెరువును నీటితో నింపుతాం

ఆదోని టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : రాంజల చెరువులో ప్రస్తుతం ఎంఎల్ నీరు ఉందని, మార్చి నెలాఖరులోగా చెరువును పూర్తిగా నీటితో నింపుతామని మునిసిపల్ కమిషనర్ కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన రామ్‌జల చెరువును పరిశీలించారు. ఎల్ఎల్‌సీ కెనాల్‌లో మార్చి నెల వరకు నీరు ఉంటుందని, అంతలోగా రాంజల చెరువుతో పాటు బసాపురం చెరువులో 75 శాతం నీటిని నింపుకునేలా సిబ్బందికి ఆదేశించామని చెప్పారు. వేసవిలో పట్టణ ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రమణీయం... ప్రహ్లాదరాయల పల్లకి సేవ



చెక్క పల్లకిలో ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రహ్లాదరాయల పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు. శుక్రవారం రాఘవేంద్రస్వామి మఠంలో త్రయోదశి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి పల్లకిలో ఉంచి ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేషపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు తరలివచ్చారు. రెండో శని, ఆదివారం సెలవు దినాలు కావటంతో వేలాది మంది భక్తులు వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వ మార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు.

కడిమెట్లలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంసీ గిడ్డయ్య మాదిగ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పీ రాష్ట్ర ప్రతినిధి ఆనంద్ చైతన్య మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు సుభాస్ చంద్రబోస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. మందకృష్ణ మాదిగ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ కుమార్, పూలచింతపెద్దయ్య, ప్రకాశం, జార్జీ, ప్రభాకర్, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

గోనెగండ్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో మణిమంజరి, ఈవో ఆర్డీ అనంతశయన, పీఆర్ఏఈ శివశంకర్ కోరారు. ఎంపీడీవో సమావేశ భవనంలో గ్రామస్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రాంతీయకరణ అనే అంశంపై మండలలోని సర్పంచులు, వీఆర్వోలు, సర్వేయర్లు, ఇంజనీర్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పచ్చదనం పరిశుభ్రత పాటించాలని అన్ని గ్రామాలలో మౌలివసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులకు, అధికారులు సూచించారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

నందవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలో శుక్రవారం ఈవోపీఆర్డీ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామాల అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పుల్లయ్య మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు గుర్తించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కారం అయ్యేవిధంగా చూస్తామన్నారు. రెండవ విడల శిక్షణ 17,18న జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమం పీఆర్ ఏఈఈ నరసింహాలు, ఏపీఎం రాఘవేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి: డీఎస్పీ



సీపీఐ వందేళ్ల సంచికను విడుదల చేస్తున్న డీఎస్పీ

ఎమ్మిగనూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులు పోరాటా లతోపాటు సామాజిక సేవలో ముందుండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు అన్నారు. శుక్రవారం డివిజన్ కార్యాలయం దగ్గర సీపీఐ వందేళ్ల చరిత్ర, పోరాటాలు, త్యాగాలకు సంబంధించిన ప్రత్యేక సంచికను డీఎస్పీ విడుదల చేశారు. సీపీఐ నాయకులు రంగన్న, భాస్కర్ యాదవ్, చిన్నన్న, జబ్బార్, విరుపాక్షి, దాదావలి, మాలిక్, సమీవుల్లా, విజేంద్ర, మల్లికార్జున గౌడ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

- ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 17 సాగునీటి సంఘాలు
- మద్దతుదారులను సిద్ధం చేసుకున్న టీడీపీ, సందిగ్ధంలో వైసీపీ

ఎమ్మిగనూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు ఎన్నికలు శనివారం నిర్వహించేందుకు అధికారం సిద్ధమయ్యారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 17 సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ) ఉన్నాయి. ఈ సంఘాల్లో దాదాపు 17,200మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. డబ్ల్యుయూఏ నెంబరు 27 హాలహర్వి, నెం.28 నందవరం, నెం.29 మంత్రాలయం, నెం.30 నందవరం(నదికైరవాడి), నెం.31 నందవరం, నెం.32 కనకవీడు, నెం.33 నందవరం, నెం.34 ఎమ్మిగనూరు, నెం. 35, 36 ఎమ్మిగనూరు(కలుగోట్ల), నెం.37మిట్ట సోమపురం, నెం.38 ఎమ్మిగనూరు, నెం.39 గోనెగండ్ల, నెం. 40 అలువాల, నెం.41 పెద్దనేలటూరు, నెం. 42 గోనెగండ్లలో సాగునీటి సంఘాల ఉన్నా యి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 17 చోట్ల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కలుగోట్ల, పార్లపల్లి, తిమ్మాపురం, నందవరం, కనకవీడు, గురుజాల, అలువాల, పెద్దనేలటూరు, గోనెగండ్లలో ఏర్పాట్లు చేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధికార టీడీపీ మద్దతుదారులను ఇప్పటికే ఖరారు చేసింది. గత వారం రోజుల క్రితమే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మూడు మండలాల నాయకులతో సమావేశమై అభ్యర్థులను ఎంపిక చేశారు. దీంతో అధికార పార్టీనాయకులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ప్రతిపక్ష వైసీపీ నాయకులు ఎన్నికలపై ఆసక్తి చూపకపోవటంతో అన్ని స్థానాల్లో తామే ఏకగ్రీవంగా గెలుస్తున్నామని ఆనందంలో ఉన్నారు. అయితే ఎమ్మిగనూరు మండలంలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన అనుచరులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. శుక్రవారం రాళ్లదొడ్డి గ్రామంలో ఎన్నికలపై రైతులతో మాట్లాడినట్లు తెలిసింది. దీంతో ఎమ్మిగనూరు మండలంలో కొన్ని డబ్ల్యూయుఏ సంఘాలకు ఎన్నికలు అనివార్యమయ్యే పరస్థితి కనిపిస్తోంది. మరి నేడు ఎన్నికలా.. లేక ఏకగ్రీవమా అనేది తేలనుంది.

గోనెగండ్లలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలు

గోనెగండ్ల: నేడు నిర్వహిస్తున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సర్వసిద్ధం చేశారు. గోనెగండ్ల ఎల్లెల్సీ సెక్షన్ కింద మూడు నీటి సంఘాలు ఉన్నాయి. 39 డీపీ 86, 40 పీడీ, 41 ఎంఎల్ఎస్‌పీ ఉన్నాయి. అయితే డీపీ 86 కాలువ కింద రాళ్లదొడ్డి, గోనెగండ్ల, పెద్దమరివీడు, గ్రామాలు ఉన్నాయి. ఇందులో 961 మంది రైతులు ఓటర్లుగా ఉన్నారు. అలాగే పీడీ సెక్షన్ కాలువ కింద 2809 మంది ఓటర్లు ఉండగా అలువాల, చిన్నమరివీడు, గోనెగండ్ల, పెద్దమరివీడు గ్రామాలు ఉన్నాయి. ఎంఎల్ఎస్‌పీ సెక్షన్ కాలువ కింద 1906 మంది ఓటర్లు ఉండగా అలువాల, కులుమాల, చిన్నమరివీడు, పెద్దనేలటూరు గ్రామాలు ఉన్నాయి. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు కింద 12 సాగు నీటి సంఘాలు ఉన్నాయి.



తుంగభద్ర దిగువకాలువ

ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఇవే: మండలంలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎల్లెల్సీ కాలువలకు మూడు కేంద్రాలు 1. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల గోనెగండ్ల, 2. ఎపీపీ స్కూల్ అలువాల, 3. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దనేలటూరు, గాజులదిన్నె ప్రాజెక్టు సాగునీటి సంఘాలకు ఐదు కేంద్రాలు 4. జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ కైరవాడి, 5. గ్రామసచివాలయం తిప్పనూరు, 6. ఏపీ మోడల్ స్కూల్ గాజులదిన్నె, 7. గవర్నమెంట్ జూనియర్ కళాశాల గాజులదిన్నె ప్రాజెక్టు, 8. జీడీపీ ఏఈ పాత ఆఫీసు గాజులదిన్నె ప్రాజెక్టు. ఈ పోలింగ్ కేంద్రాల చుట్టు పోలీసులు 144 సెక్షన్ ను అమలు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. టీసీ సభ్యులు ఎన్నిక ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అనంతరం భోజన విరామం తరువాత సాయంత్రం ఐదు లోపు డబ్ల్యూఏ ప్రెసిడెంట్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలను మూడు పద్ధతుల్లో జరపనున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి పద్ధతి రైతుల మధ్య ఏకాభిప్రాయం, అది కుదరకపోతే చేతులు ఎత్తి తెలపడం, అదీ కాకుంటే రహస్య ఓటింగ్ జరుపనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, వైసీపీ రహస్య ఓటింగ్‌కే పట్టు పట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి : సీఐ



ఎన్నికలపై పోలీసులకు సూచనలిస్తున్న సీఐ

నందవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఎమ్మిగనూరు తాలుకా సీఐ మధుసూదన్ సూచించారు. శుక్రవారం రాత్రి నందవరం స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది సూచనలు ఇచ్చారు. ఎన్నికలు జరిగే ప్రదేశంలో ఓటు హక్కు ఉన్నవారినే మాత్రం పంపాలన్నారు. అలాగే ఎన్నికలు జరిగే పాఠశాల ప్రాంతం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలంలో శనివారం నిర్వహిస్తున్న సాగునీటి సంఘం ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పార్లపల్లి, కె.తిమ్మాపురం, పెసలదిన్నె, కలుగొట్ల గ్రామాల్లో జరిగే సాగునీటి సంఘం ఎన్నికల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

వైభవంగా హనుమాన్ వ్రతం

- ఆంజనేయస్వామి విగ్రహానికి వెండి కవచ సమర్పణ
- ప్రత్యేక అభిషేకాలు చేసిన పీఠాధిపతి



ఆంజనేయస్వామికి హారతులిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి బృందావనం ఎదురుగా వెలసిన ఆంజనేయస్వామి విగ్రహానికి వెండి కవచ సమర్పణ సేవ చేశారు. శుక్రవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో హనుమాన్ వ్రతం సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేసి మంగళహారతులు ఇచ్చారు. అర్చకులు ఆంజనేయస్వామికి తులసి అర్చన వేశారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

● **ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి:** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా తిరుపతికి వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం సంస్థాన పూజ నిర్వహించి భక్తులకు ఫల పుష్ప మంత్రాక్షితలు ఇచ్చిన అనంతరం తమ శిష్యబృందంతో తిరుపతికి బయలుదేరి వెళ్లారు. శనివారం తిరుమల వేంకటేశ్వరస్వామిని సామూహిక దర్శనం చేసుకున్న అనంతరం 16న ఉదయం మంత్రాలయంలో ఉంటారని మఠం అధికారులు తెలిపారు.

జమిలి ఎన్నికలు వస్తాయని సంబరపడుతున్నారు

- వైసీపీ శాశ్వతంగా ప్రతిపక్షంలోనే కూర్చోవాలి
- ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి
- రూ.రెండు కోట్లతో పట్టణంలో బీటీ రోడ్లు

ఎమ్మిగనూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు వస్తాయని వైసీపీ నాయకులు సంబరపడుతున్నారని, అయితే జమిలి ఎన్నికల వల్ల వైసీపీ శాశ్వతంగా ప్రతిపక్షంలో కూచుంటుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం పట్ట ణంలో రూ. రెండు కోట్లతో బీటీ రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకె ళ్తోందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు మసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నాయకులు జెమిలి ఎన్నికలు వస్తున్నాయని సంబరపడుతున్నారని, ఏ ఎన్నికలు వచ్చినా ఇక నుంచి ప్రజలు వైసీపీ నాయకులను నమ్మరన్నారు. జగన్‌కు ప్రజలు రెండో అవకాశం ఇవ్వరని అన్నారు. ఈ విషయం మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్పష్టంగా తెలియజేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోకుండా వీలైతే మంచి సలహాలు ఇవ్వాల న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీడీపీ నాయకులు చేనేతమల్లి, మిన్నప్ప, జయన్న, గల్లా సలాం, కటారి రాజేంద్ర, ప్రతాప్‌రెడ్డి, తురేగల్ నజీర్, సలీం, వెంకటేశు, నవాజ్, వాహీద్, మహేష్, అంజి, శాలేం, కామార్తి మహేష్ పాల్గొన్నారు.



బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన స్పెషల్ క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈవో ఆంజనేయులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు స్టడీ క్లాసుల పేరుతో ఉంచి, రాత్రి ఎనిమిది తరువాత వెళ్లమంటే గ్రామాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థులు ఇబ్బంది పడుతు న్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు రాముడు, నాయకులు భాస్కర్, రవితేజ పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

కోసిగి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోల్‌మాన్ పేట గ్రామంలో శ్రీమారెమ్మ దేవర పండుగను పురస్కరించుకొని డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ గ్రామ నాయకులు ఉప్పలపాటి అర్జున్ తెలిపారు. శుక్రవారం కోల్‌మాన్‌పేట గ్రామంలో డివిజన్‌స్థాయి క్రికెట్ పోటీ లను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదిరి వీరారెడ్డి, మదిరి జొలయ్య, శ్రీరాములు, ఆర్గనైజర్స్ అంజి, సాయి, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు పింఛన్ ప్రతిపాదనలపై హర్షం

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు పించన్‌ను ప్రకటించడాన్ని ఆహ్వానిస్తూ కూటమి ప్రభుత్వానికి శుక్రవారం పూలే అంబేడ్కర్ సొసైటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, జైభీమ్ ఎమ్మార్పీఎస్ చిక్కం జానయ్య, సింగనేటి నరసన్న, రవి, సుమాల, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం తొమ్మిదవ రోజు సమ్మె కొనసాగిస్తూ ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ 26వేలు, వాటితో పాటు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరి సమ్మెతో పట్టణంలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. కొన్ని కాలనీల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీరాములు, బాలాజి, సాయి, విజయ్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం: సబ్ కలెక్టర్



అగ్రహారంలో రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. శుక్రవారం గోనెగండ్ల మండల పరిధిలోని బీ అగ్రహారం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ గ్రామ భూ సర్వే పటాన్ని పరిశీలించారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీసర్వేలలో జరిగి పొరపాట్లను సరిచేసేందుకు రైతుల భూసమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీషా, జనార్దన్ రావు, ఆర్ఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రమైన నందవరం శుక్రవారం చేపట్టిన రెవెన్యూ గ్రామ సభను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. ఆర్ఐ జర్మీయా ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ 48 వినతులను స్వీకరించారు. డీటీ మహేష్, టీడీపీ నాయకులు గురురాజారావు, జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి, లచ్చప్ప పాల్గొన్నారు.

కోసిగి: గ్రామంలోని భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దార్ నిత్యానందరాజు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడు, వీఆర్వో రామాంజనేయులు, బసవరాజు, టీడీపీ నాయకులు రామయ్య, సోల్మాన్ రాజు, ప్రభాకర్ రెడ్డి, హుసేనీ, సిద్ధప్పగౌడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు : రైతులందరికీ న్యాయం చేస్తామని తహసీల్దార్ శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రంగాపురం గ్రామంలో రెవెన్యూ గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన తప్పిదాలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో వీఆర్వో గురురాజుస్వామి, సర్వేయర్ రాజు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఖో-ఖో పోటీలకు ఎంపిక



క్రీడాకారుడు బసవరాజు

కోసిగి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలం లోని జంపాపురం గ్రామానికి చెందిన చాకలి బసవరాజు సౌత్‌జోన్ ఖో-ఖో పోటీలకు ఎంపికయ్యాడు. క్రీడాకారుడు బసవరాజు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతు న్నాడు. చిత్తూరు జిల్లా స్థాయిలో జరిగిన ఖో-ఖో పోటీల్లో అక్కడ జట్టు ప్రథమ స్థానంలో కీలకంగా రాణించిన బసవరాజును సౌత్‌జోన్‌కు ఎంపికయ్యారు. ఈనెల 27న తమిళనాడులోని తిరువూరులో జరిగే పోటీలకు పాల్గొం టున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు బసవరాజు ఎంపిక కావడంపై పీడీ ఖలీల్ అహ్మద్, పీఈటీలు చెన్నబసప్ప, రామచంద్ర, ఆంజనేయులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రమాదం..అయినా పట్టించుకోరు



దైవందిన్నెలో ఇంటిముందు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పక్క చిత్రాల్లో కనిపిస్తున్న దృశ్యాలు ఎమ్మిగనూరు మండల పరిధిలోని కందనాతి, దైవందిన్నె గ్రామాల్లోనివి. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజలకు, వాహనదారు లకు ప్రమాదకరంగా మారాయి. కందనాతి గ్రా మంలోని మసీదుపురం క్రాస్‌రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతో మూగ జీవులు మృత్యువాత పడుతున్నాయి. ఈ రహదారి గుండానే ఎమ్మిగనూరు నుంచి పత్తికొండకు వందల సంఖ్యలో వాహనాలు రాకపోక లు సాగిస్తుంటాయి. అంతేగాక పవిత్రపుణ్య క్షేత్రమైన మంత్రాలయానికి గుత్తి, గుంతకల్లు, అనంతపురం ప్రాంతాల నుంచి భక్తులు ఈ రహదారి గుండానే ప్రయాణిస్తుంటారు. రహదారికి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి రక్షణగోడను ఏర్పాటు చేయడం మరిచిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే దైవందిన్నె గ్రామంలో ఇళ్లముందు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం వచ్చిన సమయంలో విద్యుత్ తీగలు ఒకటికొకటి తగిలి నిప్పులు రాలుతున్నాయని ప్రజలు తెలుపు తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ముందునే కొట్టం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణగోడలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కందనాతి గ్రామంలో ప్రధాన రోడ్డుపక్కలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఘనంగా తిక్కస్వామి తాత ఉరుసు

మంత్రాలయం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో వెలసిన తిక్కస్వామి తాత ఉరుసు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తిక్కస్వామి తాత సమాధి వరకు గ్రంథోత్సవంలో భాగంగా తెల్లవారుజాము నుంచి మంగళవా యిద్యాలు, బాజాభజంత్రీలు, డప్పులు, మేళతాళాల మధ్య గ్రంథోత్సవం నిర్వహించారు. భక్తులు పట్టువస్త్రాలు, సుగంధ తైలాలు, ఫలపుష్పాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు పరమేష్ నాయక్, విజయ కుమార్‌లు పోలీసు బందోబస్తు నిర్వహించారు.



నైవేద్యాన్ని తయారు చేస్తున్న భక్తులు

పెద్దభోంపల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ

కోసిగి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దభోంపల్లి గ్రామంలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సీసీ రోడ్డు పనులను స్థానిక వైసీపీ నాయకులతో కలిసి జిల్లా కార్యదర్శి మురళిమోహన్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.10లక్షలు మంజూరు కావడంతో పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో గట్టు భీమయ్య, కాంట్రాక్టరు చూడి బసిరెడ్డి, లక్ష్మిరెడ్డి, సామూయేల్, ఆంజనేయులు ఉన్నారు.